## ఫైలేరియా లేని సమాజం కోసం పనిచేస్తున్నాం

**జిల్లా మలేరియా అధికారి కుమారస్వామి**

**రామాయంపేట, డిసెంబర్ 31, ప్రభాతవార్త:**
ఫైలేరియా లేని సమాజం కోసం పనిచేస్తున్నామని జిల్లా మలేరియా అధికారి కుమారస్వామి అన్నారు. శనివారం మండల పరిధిలోని అక్కన్నపేట గ్రామంలో ఫైలేరియా సర్వే కార్యక్రమంలో భాగంగా రక్త నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ జిల్లాలో రామాయంపేట మండలాన్ని ఫైలట్ ప్రాజెక్టుగా తీసుకొని సర్వే చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అక్కన్నపేట గ్రామాన్ని మైక్రోఫైలేరియా కింద తీసుకొని, 300 నమూనాలను సేకరించి సెంట్రల్ ఫైలేరియా ల్యాబ్‌కు పంపుతామని అన్నారు. జిల్లాలో 1800 మంది ఫైలేరియా వ్యాధిగ్రస్తులు ఉండగా, కేవలం రామాయంపేట మండలంలోనే 561 ఫైలేరియా వ్యాధిగ్రస్తులు ఉన్నారన్నారు. భవిష్యత్తులో ఫైలేరియా వ్యాధి గ్రస్తులు లేకుండా ఉండడం కోసం ఇప్పటినుండి చిన్న పిల్లల నమూనాలు సేకరించి పరీక్ష నిమిత్తం పంపుతున్నారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే, తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.




## ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు చైర్మన్, కార్యవర్గ సభ్యులను నియమించాలి

**హోళియే దాసరుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు యాదగిరి**

**నర్సాపూర్, డిసెంబర్ 31, ప్రభాతవార్త:** ఎస్సీ ఎస్టీ రాష్ట్ర కమిషన్‌కు చైర్మన్, కార్యవర్గపాలక మండలి సభ్యులను తక్షణమే నియమించాలని హోళియే దాసరుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు శాఖమూరి యాదగిరి డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన నర్సాపూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ కమిషన్‌కు చైర్మన్, సభ్యులను నియమించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. కాగా 22 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు నియమించడం లేదన్నారు. ప్రభుత్వం కాలయాపన చేయకుండా బిఆర్ఎస్ పార్టీ నాయకులను కాకుండా దళితులైన 33 ఎస్సీ మరియు 59 ఎస్సీ ఉప కులాలకు చెందిన నాయకులను నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేకాక ఆర్డీఓ నుండి కాక మండల తహశీల్దార్ కార్యాలయాల నుండి ఎస్సీ కులధృవీకరణ పత్రాలు ఇవ్వాలన్నారు. అంతేగాక ఈ ఎస్సీ కులాల వారికి డబుల్ బెడ్ ఇండ్లను ఇవ్వాలని అదేవిధంగా దళిత బంధు పథకం అందరికి ఇవ్వాలని ఆయన అన్నారు. హోళియే దాసరి సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన మంత్రి హరీష్‌రావు

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** కొత్త సంవత్సరంలో ప్రతి ఒక్కరి ఇంటా సంతోషాలు వెల్లివిరియాలని..ప్రతి ఒక్కరూ అనందకరమైన జీవితం గడపాలని రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అకాంక్షిస్తూ జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం అయన మాట్లాడుతూ కొత్త యేడాదిలో సరికొత్త అలోచనలు, అశయాలు, లక్ష్యాలతో ముందుకు సాగాలన్నారు. సిఎం కెసిఅర్ అధ్వర్యంలో 2022లో జిల్లాతో పాటు రాష్ట్రం అభివృద్ధిలో మంచి ప్రగతి సాధించి అదర్శంగా నిలిచినట్లు తెలిపారు. అదే స్ఫూర్తితో ఈ సంవత్సరం జిల్లాను,రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు నిరంతరం కృషి చేసి ప్రజలకు మెరుగైన పాలన అందించడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. కొమురవెల్లి మల్లన్న స్వామి దయతో మల్లన్నసాగర్‌కి గోదావరి జలాలు తీసుకవచ్చి జిల్లాను సస్యశ్యామలం చేయడం జరిగిందన్నారు. విద్యార్థులు, యువత నూతన లక్ష్యాలు ఏర్పాటు చేసుకొని వాటిని చేరుకునేలా ఒక ప్రాణాళికతో ముందుకు సాగాలని మంత్రి కోరారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అకాంక్షించారు. 2022 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, 2023లోకి అడుగుపెడుతున్న వేళ అందరికీ శుభం కలగాలని కోరుకుంటూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

### నూతన సంవత్సం ప్రజల జీవితాల్లో కాంతులు నింపాలి

**జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్**

నూతన సంవత్సరంలో జిల్లాలోని ప్రజల జీవితాలలో నూతన కాంతులు విరబూయాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అకాంక్షించారు. 2022 సంవత్సరానాకి వీడ్కోలు పలుకుతూ 2023 నూతన సంవత్సరంలోకి అడిగిడుతున్న శుభసందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లాలోని ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. సిఎం కెసిఅర్, మంత్రి హరీష్‌రావు ఇతర ప్రజాప్రతినిధుల సహకారంతో జిల్లా అధికార యంత్రాంగం ముందుకు సాగుతామన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను జిల్లాలోని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెంది ప్రతి ఒక్కరూ అయురారోగ్యాలతో జీవిస్తూ అందరి జీవితాల్లో సుఖ:సంతోషాలు విరబూయాలని కలెక్టర్ అకాంక్షించారు.

### మెదక్ జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

**మెదక్ అర్బన్, డిసెంబర్ 31 ప్రభాతవార్త:**
2023 నూతన సంవత్సరంలో ప్రతి కుటుంబంలో సంతోషం విల్లివిరియాలని, ఆనందోత్సాహాల మధ్య వేడుకలు ఘనంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ హరీష్, మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిలు ఆకాంక్షించారు. 2023 ఆంగ్ల నూతన సంవత్సరంలో ప్రజలు సరికొత్త ఆలోచనలు, ఆశలు, ఆశయాలు, లక్ష్యాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఎన్నో ప్రభుత్వ ఉద్యోగ ప్రకటనలు వెలువడ్డాయని, నిరుద్యోగ యువత కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చాలని హితవు చెప్పారు. జిల్లా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

### జిల్లాలో 30, 30(ఎ) పోలీస్ యాక్ట్ అమలు

**-జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని**

**మెదక్ అర్బన్, డిసెంబర్31 ప్రభాతవార్త:**
జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని జనవరి 1వ తేదీ నుండి 31 వరకు నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా జిల్లా ప్రజలు ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. అలాగే ప్రజా ధనాన్ని నష్టం కలిగించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని ఎస్పీ హెచ్చరించారు. కాబట్టి జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు తమకు ఈ విషయం లో సహకరించాలని తెలిపారు.

### కొత్త సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి

2023 నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా ప్రజలకు ఎస్పీ రోహిణి ప్రియదర్శిని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ కొత్త సంవత్సరంలో సుఖసంతోషాలతో ఉండాలని అన్నారు. కొత్త సంవత్సర వేడుకలపై ఆంక్షలు విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, ఈ ఉత్తర్వులను అనుసరిస్తూ వాటికి అనుగుణంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని, ఈ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవడానికి ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని, పోలీసుల ఉత్తర్వులకు వ్యతిరేకంగా గుంపులుగా తిరగడం, ర్యాలీలు తీయడం వంటి చేయొద్దని, ఇద్దరు లేదా అంతకన్న ఎక్కువ మంది ద్విచక్ర వాహనాలపై తిరగటం నిషేధించడం జరిగిందని తెలిపారు.

### ఆర్ఎమ్ గ్రూప్ క్యాలెండర్ ఆవిష్కరించిన బండి సంజయ్



బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ చేతుల మీదుగా క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**నర్సాపూర్, డిసెంబర్ 31, ప్రభాతవార్త:**
బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ చేతుల మీదుగా శనివారం ఆర్ ఎమ్ గ్రూప్ క్యాలెండర్‌ను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సింగాయిపల్లి గోపి,నర్సాపూర్ అసెంబ్లీ బిజెపి కన్వీనర్ వాల్దాస్ మల్లేష్‌గౌడ్‌ల అధ్వర్యంలో నర్సాపూర్ బిజెపి నాయకులు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌ను మర్యాధ పూర్వకంగా కలిశారు ఈసందర్భంగా ఆయన చేతుల మీదుగా ఆర్ఎమ్ గ్రూప్ క్యాలెండర్ ను ఆవిష్కరింప చేయడం జరిగింది. అనంతరం నర్సాపూర్ అసెంబ్లీ బిజెపి కన్వీనర్ వాల్దాస్ మల్లేష్‌గౌడ్ అ ధ్వర్యంలో ఈ జనవరి నెల 5 న మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో శ్రీ కేతకీ బ్రమరాంభిక సహిత మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతున్నందున ఈ బ్రహ్మోత్సవాలకు హాజరు కావాల్సిందిగా బండి సంజయ్ ను ఆహ్వానించారు ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మండల బిజెపి పార్టీ అధ్యక్షులు నర్సింగరావునాయక్, శివ్వంపేట మండల బిజెపి అధ్యక్షులు నల్లరవిగౌడ్, హత్నూర మండల బిజెపి ధ్యక్షులు నాగప్రభుగౌడ్, నర్సాపూర్ పట్టణ బిజెపి అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, ప్రవీణ్ బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బీఎస్పీ అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను కలిసిన భీమన్న

**కంగ్టి, డిసెంబర్ 31, ప్రభాతవార్త:**
రాష్ట్ర బీఎస్పీ అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ను శనివారం నాడు జహీరాబాద్‌లో గల ఎంఆర్ఎఫ్ కంపెనీలో నారాయణఖేడ్ నియోజకవర్గ ఇంఛార్జ్ బోర్గి భీమన్న శనివారం నాడు కంగ్టి మండల బీఎస్పీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అయనతో నారాయణఖేడ్ నియోజకవర్గంలోని ఆయా మండలాల సమస్యలను ఆయనకు విన్నవించారు. వారు సానుకూలంగా స్పందించి తర్వలో నియోజకవర్గ పర్యటన వచ్చి ఈ ప్రాంత పజల సమస్యలపై పోరాటం చేద్దామని ఆయన అన్నారు. గత 50 సంవత్సరాల పాలనలో బహుజనులకు చేసింది ఏమి లేదని, అందరం ఒక్క తాటిపై వచ్చి పోరాడుదామని అన్నారు. మండలంలో అభివృద్ధి జరగని ఆయా గ్రామాల్లో నిర్లక్ష్యం వహించి ప్రజ ప్రతినిధులకు నిలదియ్యాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ బీఎస్పీ పార్టీ ఇంఛార్జ్ బోర్గి భీమన్నతో పాటు, విజయ్, సతీష్, శంకర్, జీవన్, అలిగే సోమన్న, సూర్యకాంత్, లచప్ప, క్రాంతి, సుహాషన్‌లు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం

**రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ మసిఉల్లాఖాన్**

**సంగారెడ్డి మున్సిపాలిటీ, డిసెంబర్ 31, ప్రభాతవార్త:**
అన్ని వర్గాల ప్రజలు అభ్యున్నతి కొరకు పాటుపడుతున్న ప్రభుత్వం దేశంలోనే మొట్టమొదటిది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమని రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ మసిఉల్లాఖాన్ అన్నారు. శనివారం సంగారెడ్డిలో రెండు కోట్ల రూపాయాలతో నిర్మించతలపెట్టిన మినీ హజ్ హౌజ్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన అమలు చేస్తున్నారని గుర్తుచేశారు. మైనార్టీల కొరకు గతంలో ఏ ప్రభుత్వం చేయని సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని గుర్తుచేశారు. పేద విద్యార్థుల విద్యకొరకు 20 లక్షల రుణ సహాయం అందిస్తుందన్నారు. సంగారెడ్డిలో నిర్మిస్తున్న హజ్ హౌస్ అవసరాలతో పాటు నిరుద్యోగలకు ఉపాధి శిక్షణ కార్యక్రమాలు కూడా చేపట్టవచ్చునని అన్నారు. సకాలంలో పనులు పూర్తిఅయి, వినియోగంలోకి వచ్చేందుకు సంబంధింత అధికారులు తగిన చర్యలు తీసుకోవానలి సూచించారు. వక్ఫ్‌బోర్డు భూములను, ఆస్తులను రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించి ప్రభుత్వానికి సహకించాలని ఆయన కోరారు. ప్రజలకోసం పనిచేస్తున్న సిఎం కెసిఆర్‌పై పనిపాట లేనివారు నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని ఆని అన్నారు. టిఆర్ఎస్ హాయంలోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని మసిఉల్లాఖాన్ అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో గురుకుల విద్యాలయ సంస్థలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. సంగారెడ్డిలో 20 కోట్లతో గురుకుల విద్యాలయాలు నిర్మించడం జరుగుతుందని, అవి త్వరలోనే వినియోగం లోనికి రానున్నాయని ఆయన అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మిరవి, మైనార్టీ మత పెద్దలు అస్లామ్, తాహేర్, అమీర్ ఖాన్, సోహెల్ అలీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎండి సోహెల్, శేఖ్ సాబేర్, యాకూబ్, సమి, టిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నర్సింలు, వక్ఫ్ బోర్డ్ జిల్లా ఇన్స్‌పెక్టర్ మహమ్మద్ పాల్గొన్నారు.

## బిజెపి నుంచి జంగం గోపి బహిష్కరణ

**-పార్టీ నాయకులపై దాడులకు పర్యావసానం**

**జహీరాబాద్, డిసెంబరు 31, ప్రభాతవార్త:** పార్టీ క్రమ శిక్షణను ఉల్లంఘించి, పార్టీ నాయకులపై దాడులకు పాల్పడిన భారతీయ జనతా పార్టీ ఐటి సెల్, జహీరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి జంగం గోపిని పార్టీ నుంచి బహిష్కరిస్తూ పార్టీ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి డాక్టర్ బి ఉమాశంకర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వుల కథనం ప్రకారం... డిసెంబరు 14వ తారీఖున నియోజకవర్గంలోని ఝరాసంగం మండలంలోని బర్దీపూర్ గ్రామంలో నిర్వహించిన ప్రజా గోస బిజెపి భరోసా, బైక్ ర్యాలీ సందర్భంగా పార్టీకి చెందిన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన పూర్మి సుధీర్‌కుమార్, ఝరాసంగంమండల పార్టీ అధ్యక్షులు భోగ అడివన్నతో పాటు మరొకొందరిపై దాడి చేసి గాయపర్చారని వచ్చిన ఫిర్యాదును నిజ నిర్ధారణ కమిటి, త్రిసభ్య కమిటిని నియమించి విచారణ (త్రిసభ్య కమిటి కన్వీనర్‌గా మాజీ మంత్రి పల్లి బాబుమోహన్, సభ్యులుగా నారాయణఖేడ్ మాజీ శాసన సభ్యులు మహారెడ్డి విజయపాల్‌రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్‌రవి గౌడ్) చేయించగా త్రిసభ్య కమిటి నివేదిక ఆదారంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్ జంగం గోపిని పార్టీ నుంచి బహిష్కరిస్తూ ఆదేశాలు జారీ చేశారన్నారు. పార్టీలోని అన్ని బాధ్యతల నుంచి తొలగిస్తూ, పార్టీ ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేస్తూ పార్టీ నుంచి బహిష్కరించినట్లు పార్టీ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి డాక్టర్ జి ఉమాశంకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## మనస్తాపంతో చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

**మెదక్ అర్బన్, డిసెంబర్31 ప్రభాతవార్త:**
పెళ్లి జరిగి 23 సంవత్సరాలు అయినా పిల్లలు పుట్టకపోవడంతో మనస్తాపంతో చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం మెదక్ పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మెదక్ పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన మన్నె నాగరాజు (43) మున్సిపల్ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్‌లో ఉద్యోగం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తుండేవాడు. పెళ్లి జరిగి 23 సంవత్సరాలు అవుతున్నా పిల్లలు పుట్టడం లేదని బాధపడుతుండేవాడు. జీవితంపై విరక్తి చెందిన మన్నె నాగరాజు మెదక్ పట్టణ శివారులోని పిట్లంబేస్ గోసముద్రంలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య భవాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## అక్రమంగా అరెస్ట్ చేయడం సరికాదు

**-ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి ప్రశాంత్**



గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న ఎన్ఎస్‌యుఐ నాయకులు

**గజ్వేల్, డిసెంబర్ 31 (ప్రభాతవార్త):** ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగ నోటిఫికేషన్‌లో జరిగిన తప్పులను సవరించాలని డిమాండ్ చేస్తూ యువజన కాంగ్రెస్ ప్రగతిభవన్ ముట్టడికి పిలుపునిస్తే అక్కడికి వెళ్ళకుండా ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి రాచకొండ ప్రశాంత్, నియోజకవర్గ అధ్యక్షుడు శ్రావణ్, జిల్లా కార్యదర్శి కపిల్ రవి, మండల కార్యదర్శి కమల్, సాయి, పవన్‌లను గజ్వేల్ పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యమాలను అణిచివేస్తూ అక్రమంగా అరెస్ట్ చేయడం సరికాదన్నారు. తెలంగాణ ఉద్యమంలో నీళ్ళు, నిధులు, నియామకాలు అనే నినాదంతో తెలంగాణను తెచ్చుకుంటే ప్రస్తుతం అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థులు, యువత జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగివచ్చి నోటిఫికేషన్‌లో జరిగిన తప్పులను సవరించాలని డిమాండ్ చేశారు.

## 2023కు విద్యార్థుల ఘన స్వాగతం



2023 ఆకారంలో నూనత సంవత్సరాన్ని స్వాగతిస్తున్న విద్యార్థుల దృశ్యం

**పాపన్నపేట, డిసెంబరు 31, ప్రభాతవార్త:** ఆంగ్ల నూతన సంవత్సరం 2023ను మండల కేంద్రమైన పాపన్నపేటలోని ఉన్నత పాఠశాల విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. పాఠశాల విద్యార్థులు 2023 అక్షర ఆకారంలో కూర్చుని కొత్త సంవత్సరాన్ని విద్యార్థులు వినూత్నంగా స్వాగతం పలికారు. 2023లో కూర్చున్న విద్యార్థుల ఆకారాన్ని చూసిన ప్రేక్షకులు సంతోషం, సంబరం చెందారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరిసింగ్ ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. పాఠశాలలో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికే కార్యక్రమం నిర్వహించడంతో విద్యార్థులు ఆనందంతో సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రమేష్ చౌదరి, యశోద, జరీనా, రాజు, అశోక్, మధు, విద్యార్థులు పాల్గొన్నారు.



మండల సమాఖ్య ఏపిఎంగా బాధ్యతలు స్వీకరిస్తున్న లక్ష్మీనారాయణకు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

## మండల సమాఖ్య ఏపిఎంగా లక్ష్మీనారాయణ

**చిన్నశంకరంపేట, డిసెంబర్ 31, ప్రభాతవార్త:**
చిన్నశంకరంపేట మండల మహిళా సమాఖ్య ఏపిఎంగా శనివారం లక్ష్మీనారాయణ బాధ్యతలు చేపట్టారు. జిల్లా కేంద్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ ఏపిఎంగా విధులు నిర్వహిస్తూ బదలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఏపిఎం వెంకటస్వామి నిజాంపేటకు బదలిపై వెళ్లగా, కొన్ని నెలలుగా ఇంచార్జి ఏపిఎంగా సీసీ యశోద బాధ్యతలు నిర్వహించారు. నూతన ఏపిఎం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మండల సమాఖ్య అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల సీసీలు, వివోఏలు ఆయనకు స్వాగతం పలికారు.

## రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ అనుభవించాలి

**-ఏఎంసి చైర్మన్ మాదాసు శ్రీనివాస్**



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఎంసి చైర్మన్ మాదాసు శ్రీనివాస్

**గజ్వేల్, డిసెంబర్ 31 (ప్రభాతవార్త):**
రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ అనుభవించాలని, వాటిని దుర్వినియోగపర్చకుండా ఉండేలా అవగాహన కలిగి ఉండాలని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, జెడ్‌పిటిసి పంగ మల్లేశంలు అన్నారు. గజ్వేల్ మండలం శేరిపల్లి గ్రామంలో సర్పంచ్ కనకయ్య అధ్యక్షతన శనివారం నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవం కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తరువాత పేద బడుగు బలహీనవర్గాల హక్కుల సాధన కోసం ప్రతినెల పౌరహక్కుల దినోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి కృష్ణగౌడ్, ఎంపిడిఓ మశ్చేందర్, డిప్యూటీ తహసీల్దార్ సతీష్, ఎస్ఐ శంకర్, ఆర్ఐ కృష్ణ, సంతోష్, బిఆర్ఎస్ నాయకులు గొడుగు స్వామి, రమేష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజాగౌడ్, గ్రామ కార్యదర్శి బిస్కెన్, గ్రామ ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

## సిఎస్ఆర్ నిధుల పర్యవేక్షణ పకడ్బందీగా జరగాలి

**జిల్లా కలెక్టర్ శరత్**

**సంగారెడ్డి బ్యూరో, డిసెంబర్ 31, ప్రభాతవార్త:** జిల్లాలోని పరిశ్రమలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద సిఎస్ఆర్ నిధులు అందజేసి జిల్లా అభివృద్ధికి సహకరించేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ శరత్ సిఎస్ఆర్ నిధుల పర్యవేక్షణ కమిటీ అధికారులకు సూచించారు. శనివారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సిఎస్ఆర్ నిధుల పర్యవేక్షణా కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. క్లస్టర్ వారీగా నివేదికలు, ఆయా అధికారులు చేపట్టిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పరిశ్రమల యాజమన్యాలు కంపెనీస్ యాక్ట్ మేరకు సామాజిక బాధ్యతగా జిల్లా అభివృద్ధికి సిఎస్ఆర్ కింద వివిధ అభివృద్ధి పనులకు నిధులను కలెక్టర్ ఖాతాలో జమ చేయాలన్నారు. కంపెనీ యాక్ట్ నిబంధన మేరకు ఉన్నది లేనిది క్షుణంగా పరిశీలించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న కంపెనీలకు సిఎస్ఆర్ గైడెన్స్ ఆక్ట్ మేరకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్లు రాజర్షి షా, వీరారెడ్డి, సిపిఓ కమిటీలోని ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేటలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న అయ్యప్పస్వాములు

## బైరి నరేష్‌పై పీడీ యాక్టు నమోదు చేయాలి

**సిద్దిపేట రూరల్, డిసెంబర్ 31, ప్రభాతవార్త :**
ఎంతో పవిత్రమైన అయ్యప్ప స్వామి పట్ల శివకేశవుల పట్ల అనుచిత వ్యాఖ్యాలు చేసిన బైరి నరేష్‌ను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని గురుస్వామి సముద్రాల రమేష్ అన్నారు. హిందువుల మనోభావాలు దెబ్బతినేలా హిందు దేవతల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్‌పై పీడీ యాక్టు నమోదు చేయాలని అయ్యప్ప సేవా బృందం ప్రతినిధులు శనివారం జిల్లా కేంద్రంలోని శ్రీ శరభేశ్వర స్వామి దేవాలయం నుఎంచి వన్ టౌన్ పోలీసు స్టేషన్ వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అన్ని మతాలను గౌరవించేది కేవలం హిందువులు మాత్రమేనని తెలిపారు. సమాజంలో అన్ని మతాలు ఒకటి అంటూనే కేవలం హిందూ దేవి దేవతల పట్ల అనుచిత వ్యాఖ్యాలు చేస్తున్న వారిని పాలకులు ఎందుకు చూసి చూడనట్లు వ్యవహారిస్తున్నారని ప్రశ్నించారు. సమాజంలో ఎవరికి నచ్చిన మత విశ్వాసాలను వారు అచరించవచ్చని అంబేద్కర్ చెప్పారని తెలియజేశారు. హిందూ దేవుళ్ళపై అనుచిత వ్యాఖ్యాలు చేస్తే సహించేది లేదన్నారు.అయ్యప్పస్వాములు, హిందూ ధార్మిక సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులను మోసం చేస్తున్న సిఎం కెసిఆర్

**పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అత్తు**



సిఎం కెసిఆర్ ఫ్లెక్సీని దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**సిద్దిపేట రూరల్, డిసెంబర్ 31, ప్రభాతవార్త :**
పోలీసు రిక్రూట్మెంట్‌లో భాగంగా మల్టిపుల్ ఛాయిస్‌లో ఏడు మార్కులు కలపకుండా సీఎం కెసిఆర్ నిరుద్యోగులను మోసం చేస్తున్నాడని సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి. ఇమామ్(అత్తు) అరోపించారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తా వద్ద ప్రభుత్వం వ్యవహారిస్తున్న తీరును నిరసిస్తూ సిఎం కెసిఆర్ ఫ్లెక్సీని దహనం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పోలీసు రిక్రూట్మెంట్‌లో భాగంగా ఏడు మార్కులను కలపాలని హై కోర్టు సూచించిన కూడా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. నిరుద్యోగుల జీవితాలతో సిఎం అటలు అడుతున్నారని సమయం వచ్చినప్పుడు అదే నిరుద్యోగాలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. యూత్ కాంగ్రెస్ ఇచ్చిన ఛలో ప్రగతి భవన్ పిలుపు మేరకు శాంతియుతంగా తరలివెళ్తున్న నాయకులను పోలీసుల చేత అరెస్టులు చేయించడం తగదన్నారు. ఎన్ని అరెస్టులు చేసిన నిరుద్యోగుల పక్షాన రాష్ట్ర ప్రజల సమస్యలపై కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ముద్దం లక్ష్మి, సతీష్‌గౌడ్, బైరి సాయి, సలీం, గయాజుద్దీన్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మంజీరా విద్యాలయంలో మాక్ పార్లమెంట్



మాక్ పార్లమెంట్ నిర్వహిస్తున్న మంజీరా విద్యార్థులు

**రామాయంపేట, డిసెంబర్ 31, ప్రభాతవార్తః**
రామాయంపేట పట్టణంలోని మంజీరా విద్యాలయంలో విద్యార్థులచే శనివారం నాడు మాక్ పార్లమెంట్ నిర్వహించారు. పార్లమెంట్ తరహాలో విద్యార్థులు వివిధ రాష్ట్రాలకు చెందిన ఎంపీలు, మరియు మంత్రులుగా, ప్రతిపక్ష నాయకులుగా ఉండి ఈ మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అతిపెద్దదైన భారత పార్లమెంట్ వ్యవస్థ ప్లామెంట్లో జరిగే కార్యకలాపాలపై భావి భారత పౌరులు అయిన విద్యార్థులకు అవగాహన కల్పించడానికి విద్యార్థులచే ఈ నమూనా పార్లమెంటును నిర్వహించడం జరగిందని పాఠశాల ఉపాధ్యాయురాలు వాసవి తెలిపారు. ప్రధానమంత్రిగా బేబీ హాసిని, స్పీకర్‌గా ఆశ్రిజ, మంత్రులుగా, ఆయా పార్టీలకు చెందిన చెందిన ఎంపీలుగా, ప్రతిపక్ష నాయకులుగా విద్యార్థులు ఆయా వేషధారణలో అలరించారు. రైతు సమస్యలపై మరియు దేశ భద్రత కోసం చేపట్టిన మిలిటరీ అగ్నిపథ్ పథకంపై చర్చ జరిగింది. క్వశ్చన్ అవర్, జీరో అవర్స్, బడ్జెట్ ఫైల్ ఆవిష్కరణ మొదలైనవి జరిగాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జితేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పుట్టి సురేష్, రామ్‌రెడ్డి, శ్రీశైలం, అనిల్, సుధాకర్, మౌనిక, మీనా, అమూల్య, కృష్ణప్రియ తదితరులు పాల్గొన్నారు.

## మామిడ్గిలో మట్కా నిర్వాహకుడి అరెస్టు

**-మట్కా చాట్, 4 చిట్టీలు, నగదు స్వాధీనం**

**న్యాల్‌కల్, డిసెంబరు 31, ప్రభాతవార్త:** ప్రభుత్వం నిషేదించిన మట్కాను నిర్వహిస్తున్న వ్యక్తిని హద్నూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన శనివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ఎస్ఐ వినయ్‌కుమార్ కథనం ప్రకారం... మండలంలోని మామిడ్గి గ్రామంలో మట్కాను నిర్వహిస్తున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు ఎస్ఐ వినయ్‌కుమార్ ఎఎస్ఐ వెంకటేష్, సిబ్బంది సంగమేశ్‌లతో కలిసి సంఘటన స్థలానికి చేరుకోగా మట్కా నిర్వాహకుడు తన కాళ్లకు బుద్ధి చెప్పగా పోలీసులు నిర్వాహకుడిని వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. మట్కా నిర్వహిస్తున్న వ్యక్తి కూరగాయల వ్యాపారం చేసుకునే మామిడ్గి గ్రామానికి చెందిన మంగలి లాలప్ప (39)గా గుర్తించారు. నిర్వాహకుడి వద్ద నుంచి 3వేల 6వందల రూపాయలు,మట్కా చాట్, నాలుగు చిట్టీలులను స్వాధీనం చేసుకున్నామన్నారు. సుమోటోగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు. మట్కా, జూదం ఆటలు ఆడితే ఎంతటి వారైనా చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు

## బైరి నరేష్‌పై పిడి యాక్టు నమోదు చేయాలి: అయ్యప్ప భక్తులు



పోలీసు స్టేషన్ వద్ద అయ్యప్ప భక్తులు

అల్వాల్, డిసెంబరు 31 ప్రభాతవార్త: అయ్యప్పతో పాటుగా హిందూ దేవతలు దేవుళ్ళపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్‌పై పిడి యాక్ట్ నమోదు చేయాలని అయ్యప్ప భక్తులు డిమాండ్ చేశారు. శనివారం వారు అల్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. అంతకు ముందు బాలాజీ వెంకటేశ్వర ఆలయం నుంచి ర్యాలీగా పోలీసు స్టేషన్‌కు వచ్చారు. కులాలు మతాలకు అతీతయంగా అయ్యప్పను కొలుస్తున్నారని వారు స్పష్టం చేశారు. అంబేడ్కర్ వారసులమని చెప్పుకుని ఆయనకు చెడ్డ పేరు తెస్తున్నారని దుయ్యబట్టారు. దేవునిపై నమ్మకం లేదని ఇష్టం వచ్చినట్లు తిడితే సహించేది లేదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్‌రెడ్డి కృష్ణారెడ్డి దుర్గాప్రసాద్ యాదవ్ కార్తీక్ రెడ్డి లక్ష్మణ్ ఆనంద్ శ్రవంతి తదితరులు పాల్గొన్నారు.

## హీరాబెన్‌కు నివాళి

అల్వాల్, డిసెంబరు 31 ప్రభాతవార్త: ప్రధాని మోదీ తల్లి స్వర్గీయ హీరాబెన్‌కు భారతీయ జనతాపార్టీ నేతలు నివాళు లర్పించడం జరిగింది. బృందావన్ కాలనీలో పార్టీ సీనియర్ నేత దండుగుల వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నేతలు కార్యకర్తలు పాలు పంచుకు న్నారు. ప్రధాని మాతృమూర్తి చిత్రపటానికి పూలమాలలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ అజయ్‌రెడ్డి అజిత్ సాయికుమార్ మల్లేష్ కరుణశ్రీ పద్మిని ప్రతిభ పాల్గొన్నారు.

## పేద విద్యార్థులను ఆధుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు క్రీడా పరికరాలను అందజేస్తున్న జంపనప్రతాప్ తదితరులు

కంటోన్మెంట్, డిసెంబర్ 31 ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులను ఆధుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా హుమాన్ పౌండేషన్ వ్యవస్థాపకులు బంటియా సహకారంతో కార్కాన లోని ప్రాథమిక పాఠశాలకు అందజేసిన వాలీబాల్, క్రికెట్, రింగ్స్ వంటి క్రీడా పరికరాలను శనివారం జంపన చేతుల మీదుగా అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులను ఆధుకునేందుకు హుమాన్ పౌండేషన్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా క్రీడా పరికరాలతో పాటు పాఠ్య పుస్తకాలు, నోటుపుస్తకాలు, అనాథ ఆశ్రమంలో నివాసం ఉంటున్న వృద్ధులకు నిత్యవసర సరుకులను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివరాజ్, షెడ్రక్, పెరుక మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యంగా జీవించండి



పాఠశాలకు మిషన్లు పంపిణీ చేస్తున్న డా.ఎన్.గౌతంరావు

హైదరాబాద్, డిసెంబరు 31 ప్రభాతవార్త: కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లు శుభ్రం చేసే యంత్రాల పంపిణీ కార్యక్రమం శనివారం అంబర్‌పేట డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలలో జరిగింది. ఈ కార్యక్రమం అంబర్‌పేట డివిజన్ బిజెపి అధ్యక్షుడు దాసోజు నాగభూషణం ఆధ్వర్యంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డా.ఎన్.గౌతంరావు ముఖ్య అతిథిగా పాల్గొని సంబంధిత పాఠశాల యాజమాన్యంకు మిషన్ అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ భారత్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యంగా జీవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయుకులు కృష్ణాగౌడ్, ఆనంద్‌గౌడ్, శ్యాంరాజు, యశ్వంత్, కృష్ణముదిరాజ్, యాదగిరి, భాస్కర్‌గౌడ, ఈశ్వర్, మల్లారెడ్డి, జ్యోతి, తిరుపతి, రత్నప్రభ తదితరులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సిఈఓ మధుకర్ నాయక్, సామాజిక కార్యకర్త తేలుకుంట సతీష్‌గుప్త

కంటోన్మెంట్, డిసెంబర్ 31 ప్రభాతవార్త: కంటోన్మెంట్ 5వ వార్డుకు చెందిన సామాజిక కార్యకర్త, వాసవి నగర్ కాలనీ మాజీ అధ్యక్షుడు తేలుకుంట సతీష్‌గుప్త ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను కంటోన్మెంట్ బోర్డు సిఈఓ మధుకర్ నాయక్ ఆవిష్కరించారు. 2022 సంవత్సరంలో తేలుకుంట సతీష్‌గుప్త వివిధ చేపట్టిన వివిధ సేవా కార్యక్రమాలను నూతన సంవత్సర క్యాలెండర్‌లో ఫోటోలను పొందుపర్చినందుకు సిఈఓ అభినందించారు. వాసవి నగర్ నాయకులు బీమ్ శంకర్, గంప సాయిప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బీసీ జాబితాల నుంచి కులాలను తొలగించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదు

**బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపి ఆర్.కృష్ణయ్య**

చిక్కడపల్లి, డిసెంబరు 31 ప్రభాతవార్త: బీసీ జాబితాల నుంచి కులాలను తొలగించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య స్పష్టం చేశారు. శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ రాష్ట్ర తొలగించబడిన 26 బీసీ కులాల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ళ రామకృష్ణ అధ్యక్షతన 'తెలంగాణ బీసీ కులాల ఆత్మగౌరవ సభ' జరిగింది. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ 2014లో తొలగించబడిన 26+1 బీసీ కులాలను వెంటనే తెలంగాణ బీసీ జాబితాలో కలపాలని డిమాండ్ చేశారు. కులాలను కలపాల్సిందిపోయి ఈ విధంగా తొలగించడం అన్యాయమని అన్నారు. ఈ కులాలను బీసీ జాబితా నుంచి తొలగించవలన అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, కేంద్ర జాబితాలో బీసీలుగా ఉద్యోగాలు పొందుతున్నారని, విద్యాసంస్థల్లో అడ్మిషన్లు పొందుతున్నారని, కాని రాష్ట్రంలో ఉద్యోగాలు పొందడం లేదని, విద్యాసంస్థలలో అడ్మిషన్లు పొందడం లేదని, ఇది సహన్యాయసూత్రాలకు విరుద్దమని అన్నారు. రాజ్యాంగ ప్రకారం ఏదైన తొలగించాలనన లేదా కలపాలన్న బీసీ కమిషన్ ద్వారా మాత్రమే చేయాలని, 45 సంవత్సరాలుగా బీసీ సౌకర్యాలు పొందిన ఈ కులాలను అర్ధాంతరంగా తొలగిస్తే ఈ కులాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఈ సభలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలా వెంకటేశ్, సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పివివి.సత్యనారాయణ, కార్యవర్గసభ్యులు టి.శ్రీనివాస రావు, ఎస్‌వి.రావు, సిహెచ్.ప్రసాద్, సిహెచ్.వేణు, పి.మురళీధర్ పాల్గొన్నారు.

## బడుగు, బలహీనవర్గాలు హక్కుల సాధనకు సిద్ధాంత ప్రాతిపదికగా ఉద్యమించాలి

**తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు**



ప్రసంగిస్తున్న తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

చిక్కడపల్లి, డిసెంబరు 31 ప్రభాతవార్త: బడుగు, బలహీనవర్గాలు తమ హక్కుల సాధనకు సిద్ధాంత ప్రాతిపదికగా ఉద్యమించాలని అప్పుడే ప్రయోజనమైన ఫలితాలు పొందగలరని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు అన్నారు. శనివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాలలిత కళావేదికలో జాతీయ బీసీ దళ్ అధినేత దుంద్ర కుమరస్వామి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన వకుళాభరణం కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ నాటి ఫ్రెంచ్ విప్లవం నుంచి నేటి తెలంగాణ ఉద్యమం వరకు బలీయమైన సిద్ధాంతం, లక్ష్యాలు, ఆశయాలున్నాయని, సిద్ధాంత పునాది లేని ఉద్యమం కకేవలం రాద్ధాంతంగా మారుతుందన్నారు. బీసీల సమస్యలు వైవిధ్యం, విభిన్నం ఐనవని వాటి పరిష్కారంకు సిద్ధాంతపరమైన భావజాల వ్యాప్తి జరగాలన్నారు. రామ్‌మనోహర్ లోహియా, భాగ్యరెడ్డి వర్మ పూలే వంటి మహనీయులు నిర్దిష్టమైన లక్ష్యాలతో ఉద్యమించి లక్ష్యాలు సాధించారన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ భాగయ్య, జాగృతి ప్రతినిధి మురళీకృష్ణ పాల్గొన్నారు.

## ఘనంగా అన్నమాచార్య సంగీత నృత్య స్వర నీరాజనం

సైఫాబాద్, డిసెంబరు 31 ప్రభాతవార్త: భారత్ వరల్డ్ రికార్డ్స్ అధ్యక్షుడు లయన్ కె.వి.రమణారావు అధ్యక్షతన శనివారం రవీంద్రభారతి ముఖ్యహాల్‌లో పదకవితా పితామహుడు శ్రీఅన్నమాచార్య సంగీత నృత్య స్వర నీరాజనం కార్యక్రమం ఘనంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వందలాది మంది చిన్నారులు ఈ సంగీత నృత్య స్వర నీరాజనం కార్యక్రమంలో పాల్గొని అలరించారు. అన్నమయ్య కీర్తనలు అలపిస్తూ నృత్యం చేశారు. ఈ సందర్భంగా భారత్ వరల్డ్ రికార్డ్స్ అధ్యక్షుడు రమణారావు తాళ్ళపాక అన్నమాచార్య బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో పేరు నామోదు చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధులుగా తెలంగాణ బిసి కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, సినీ నటి రాగిణి, మహ్మద్ రఫీ, పసుమర్తి శేషుబాబు, వనిత (గుప్పెడంత ప్రేమ సీరియల్‌ఫేమ్) తదితరులు పాల్గొని చిన్నారులకు అశీస్సులు అందజేశారు. భారత్ అకాడమి అధ్యక్షురాలు లయన్ లలితకుమారి, ఎబిసి ఫౌండేషన్ అధ్యక్షుడు లయన్ కదిరి వెంకటరమణారావు, మాగంటి వసుధ, పూర్ణిమ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

## ఘనంగా కూకట్‌పల్లి అయ్యప్ప స్వామి ఆలయ 31వ వార్షికోత్సవం

కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 31, ప్రభాతవార్త : హరిహతనయుడు, ముల్లోకాలను ఏలే ముక్కంటి తనయుడు శ్రీఅయ్యప్ప స్వామి మహాపడిపూజ మహోత్సవం కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని శ్రీ అయ్యప్ప ఆలయంలో శనివారం వైభంగా సాగింది. కూకట్‌పల్లి భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, తిరుమల తిరుపతి దేవస్థానం అడ్వైజర్ కమిటీ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ ఉత్సవాన్ని అంగరంగ వైభంగా నిర్వహించారు. పడిపూజలో బిజెపి రాష్ట్ర అధ్యక్షలు బండి సంజయ్, మధ్యప్రదేశ్ ఇన్‌చార్జీ మురళీధర్‌రావు, మాజీ శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ పడిపూజ మహోత్సవం అఖిల భారత అయ్యప్ప పడిపూజకు అయ్యప్ప స్వాములు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలో పాల్గొన్నారు. పడిపూజ వేదిక వద్ద అయ్యప్ప స్వాములు నియోజకవర్గ ప్రజలతో కిక్కరిసిపోయింది. వడ్డేపల్లి రాజేశ్వరరావు దంపతులు ప్రత్యే పూజలు నిర్వహించారు.

## అయ్యప్ప స్వామిని దూషించిన దుండగుడిని కఠినంగా శిక్షించాలి



అయ్యప్ప స్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్‌ను కఠినంగా శిక్షించాలని బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌లో ఆందోళన చేస్తున్న స్థానికులు

నార్సింగి, డిసెంబర్ 31 ప్రభాతవార్త : కోట్లాది మంది ఆరాధ్య దైవమైన హరిహర తనయుడు అయ్యప్ప స్వామి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్‌ను కఠినంగా శిక్షించాలని బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ నాయకులు తలారి ప్రేమ్ కుమార్, బ్యాగరి శ్రీనివాస్, అంకం గోపాల్‌లు డిమాండ్ చేశారు. శనివారం అంబేద్కర్ విగ్రహం ముందు ఉన్మాదిని కఠినంగా శిక్షించాలని పెద్ద పెట్టున నినదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఫొటోలు పెట్టుకొని హిందువుల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడడం దారుణమని, చట్టాన్ని అతిక్రమించిన సదరు వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అయ్యప్ప, పరమ శివుడు, విష్ణుమూర్తిలను కించపరుస్తు మాట్లాడి కోట్లాది మంది హిందువుల మనోభావాలు దెబ్బ తీశారని, ఇలాంటి వారిని కఠినంగా శిక్షించాలని, ఇక ముందు ఇలాంటి సంఘటనలు జరుగకుండా చర్యలుండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, అరుణ్ కుమార్, అంకం శ్రీనివాస్, తలారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## హన్‌మాన్ చాలీసా పారాయణం



అఫ్జల్‌గంజ్, డిసెంబర్ 31ప్రభాతవార్త: గౌలిగూడ నగర ధర్మ జాగరణ ఆధ్వర్యంలో శనివారం చారిత్రాత్మకమైన ఉస్మాన్‌షాహి విఠలేశ్వర మందిరంలో హన్‌మాన్ చాలీసా పారాయణం ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ధర్మజాగరణ ప్రముఖ దక్షిణ మధ్యక్షేత్ర ముఖ్య వక్త అమర్ లింగం హన్‌మాన్‌చాలీసా కొనసాగింది. ఈ కార్యక్రమంలో ధర్మ జాగరణ గౌలిగూడనగర ప్రముఖ్ గోవింద్‌రాజు మహారాజ్‌లతోపాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జంగల్ విఠోభా మందిరంలో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు చేస్తున్నారు.

## పేదలను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి : పిడమర్తి రవి



కంటోన్మెంట్‌లో దుప్పట్లు పంపిణీ చేస్తున్న పిడమర్తి రవి తదితరులు

కంటోన్మెంట్, డిసెంబర్ 31 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గంలోని వివిధ మురికివాడల్లో నివాసం ఉంటున్న పేద ప్రజలను ఆధుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పోరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి తెలిపారు. శనివారం కంటోన్మెంట్‌లోని అన్నా నగర్, రైల్ నిలయం అంబేద్కర్ నగర్ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న నిరుపేదలకు పిఎస్.ఆర్ చారిటబుల్‌ట్రస్ట్ సహకారంతో పిడమర్తి చేతుల మీదుగా దుప్పట్లను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలి తీవ్రత ఉండడం వల్ల నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ జేఏసిసి గ్రేటర్ అధ్యక్షుడు జెర్రిపోతుల సాయన్న, ఆటో యూనియన్ అధ్యక్షుడు ప్రశాంత్ బాబు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఎల్.పెద్ద రాజు, సురేశ్, బాల్‌నర్సింహ్మా, వెంకటయ్య పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సమావేశంలో పాల్గొన్న కొత్త అశోక్‌గౌడ్

మెహిదీపట్నం, డిసెంబర్ 31, ప్రభాతవార్త : కేంద్రప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెల్లి పార్టీ పటిష్టతకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీజేపీ కార్వాన్ నియోజకవర్గ పాలకులు కొత్త అశోక్‌గౌడ్ కోరారు. శనివారం కార్వాన్ నియోజకవర్గ సమావేశాన్ని గుడిమల్కాపూర్‌లోని వివేకానంద కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటగా కార్వాన్ దర్బార్ మైసమ్మ దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కొత్త అశోక్‌గౌడ్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కొసం కేంద్రప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుంద న్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఉమారాణి, గోల్కొండ జిల్లా అధ్యక్షులు పాండుయాదవ్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఠాకూర్ అమర్‌సింగ్, గుడిమల్కాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవర కరుణాకర్, కార్వాన్ నియోజకవర్గ కన్వీనర్ ఆకుల గోవర్ధన్‌రావు నాయకులు మాణిక్‌ప్రభు, కట్ల అశోక్ కార్యకర్తలు పాల్గొన్నారు.



చిగురించే కొత్త కొత్త ఆశలతో ఉజ్వల భవిష్యత్తు వేదికగా కోటీ కాంతులు కొత్త సంవత్సరానికి సౌందర్య స్వాగతం



నగరంలో న్యూ ఇయర్ సందర్భంగా డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులను నిర్వహిస్తున్న పోలీసులు

## కెపిహెచ్‌బిలో ఘనంగా ఎన్‌టిఆర్ శతజయంతి



అన్నదానం చేస్తున్న నందమూరి సుహాసిని

కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 31, ప్రభాతవార్త : ఎన్‌టిఆర్ వంద శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం కెపిహెచ్‌బి 114 డివిజన్ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ధనలక్ష్మి సెంటర్, కెపిహెచ్‌బి రోడ్ నెంబర్ 2 మండల ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు మాస్కులు, శానిటైజర్ డబ్బాలు, ట్యూబ్‌లైట్స్ పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెదేపా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇంచార్జీ నందమూరి సుహాసిని విచ్చేసి స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఎన్‌టిఆర్ చేసిన సేవలను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థులకు ఆమె చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెదేపా తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఉప్పల పద్మాచౌదరి, వి.రాజా, శివసత్యనారాయణ, రామకృష్ణ, ఉమా, రామకృష్ణ, రమాదేవి, షేక్ సత్తార్, ఎ.దీపక్ పాల్గొన్నారు.

## పాతబస్తీలోని వెంకటేశ్వర స్వామి దేవాలయాల్లో వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు



చార్మినార్, డిసెంబరు 31 ప్రభాతవార్త : చార్మినార్ సమీపంలోని చౌక్ మైదాన్ ఖాన్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో జనవరి నెల రెండవ తేదీ నుంచి 16వ తేదీ వరకు అత్యంత వైభవంగా వైకుంఠ ఏకాదశి మహోత్సవాలను నిర్వహించనున్నట్లు మందిరం ప్రధాన పూజారి శృంగారం రమణా చార్యులు తెలిపారు. సోమవారం జరగనున్న శ్రీ ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీ బాలాజీ మందిరాన్ని అందంగా అలకంరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండ మందిరం కమిటి ప్రతినిధులు అన్ని చర్యలు తీసుకున్నారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా 2వ తేదీ సోమవారం వేకువ జామున 4 గంటలకు తోమాల సేవ, ఉదయం 6 గంటలకు శ్రీ వెంకటేశ్వర స్వామి నేత్ర దర్శనం, 6.30 గంటలకు స్వామి వారి వైకుంఠ దర్శనం, పల్లకి ఊరేగింపు, 8 గంటలకు తులసీ హారతి, 4వ తేదీ బుధవారం 5 గంటలు నుంచి రాత్రి 8 గంటలు వరకు నమ్మాళ్వార్ పరమ పద మహోత్సవం, 14వ తేదీ శనివారం 6 గంటలు నుంచి 8.30 గంటలు వరకు శ్రీ గోదాదేవి కళ్యాణం, 16వ తేదీ సోమవారం కరినోము తదితర కార్యక్రమాలు జరుగుతాయని ఆయన తెలిజేశారు. కళ్యాణం, వైకుంఠ మహోత్సవాలలో పాల్గొన దలచిన భక్తులు ఆలయ అర్చకులను సంప్రదించాలని ఆయన కోరారు. కాగా చార్‌కమాన్‌లోని శ్రీ బాలాజీ మందిరం, చేలాపురలోని వెంకటేశ్వర్ స్వామి దేవాలయం, పాతబస్తీ ఫత్తేదర్వాజ, పూల్‌బాగ్‌లలోని శ్రీ వెంకటేశ్వర స్వామి మందిరాలలో శ్రీ ముక్కోటి ఏకాదశి మహోత్స వాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని దేవాలయాల కమిటి ప్రతినిధులు మందిరాలను అందంగా అలంకరించారు.

## అనాధలను ఆదుకోవాలి

**స్మైఫౌండేషన్ అధ్యక్షులు వై.సంజీవకుమార్**

ధర్నాచౌక్, డిసెంబర్ 31, ప్రభాతవార్త: మన నగరంలో తమకంటూ ఎవరూ లేకుండా రోడ్డుమీద జీవిస్తున్న అనాధలను, అభాగ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని స్మైఫౌండేషన్ అధ్యక్షులు వై.సంజీవకుమార్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం అర్ధరాత్రి స్మైఫౌండేషన్ వాహనంలో నగరంలో పలు ప్రాంతాలలో తిరుగుతూ రోడ్డుపై నిద్రిస్తున్న అభాగ్యులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు ఓ.పావని, సభ్యులు ప్రవల్లిక, సుచిత్ర, అఖిల్, జతిన్, ఇర్ఫాన్, హరీష్‌కుమార్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో వసతులు కల్పించాలి

**కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్**



ఎంఇఓ రాంరెడ్డికి కార్పొరేటర్ సంగీత గౌరీశంకర్ వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

చార్మినార్, డిసెంబరు 31 ప్రభాతవార్త : అత్తాపూర్ డివిజన్ పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో మౌళిక వసతులు కల్పించాలని కోరతూ అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్ శనివారం మండల విద్యాశాఖాధికారి రాంరెడ్డికి వినతి పత్రం అందజేశారు. డివిజన్ పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో వసతులు లేనందున విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, పాఠశాలలకు మరమ్మతులు చేయటంతో పాటు మౌళిక వసతులు కల్పించాలని కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్ ఎంఇఓకు అంద జేసిన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అత్తాపూర్ డివిజన్ బిజెపి ప్రధాన కార్యదర్శి రావుల జగన్, బిటుకూరు సిద్దేశ్వం, కొంగళ్ల బుచ్చయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు సహాయం చేయడం అభినందనీయం

**బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్**



బండ్లగూడ జాగీర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్

నార్సింగి, డిసెంబర్ 31 ప్రభాతవార్త : నిరుపేద విద్యార్థులకు సహాయం చేయడం అభినందనీయమని బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం బండ్లగూడ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు సురక్ష, సాయి యాదాద్రి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధుల బృందం ఉచితంగా బ్యాగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మేయర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం అనేక సంస్కరణలు సమర్థవంతంగా అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వ బడుల్లో రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద బిడ్డలే చదువుతుంటారని, వీరికి చదువాలన్న ఆసక్తి ఉన్నా, ఆర్థిక ఇబ్బందుల కారణంగా మధ్యలోనే చదువులు ఆపడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేషన్ టీఆర్ఎస్ అధ్యక్షులు గోకరి సురేష్‌గౌడ్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సోమ సుందర్ రావ్, అశోక్, కల్పన, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించడంలోనే సంతృప్తి

**కార్పోరేటర్ మహాలక్ష్మీరామన్‌గౌడ్**



రెడ్డి కాలనీలో అధికారులతో కలిసి సమస్యలు తెలుసుకుంటున్న మహాలక్ష్మీరామన్‌గౌడ్

హైదరాబాద్, డిసెంబరు 31 ప్రభాతవార్త: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారిం చడం ద్వారానే సంతృప్తి లభిస్తుందని, ప్రజలను కష్టాలు పాలు చేస్తే బాధలు తప్ప మరొకటి లేదని హిమాయత్‌నగర్ డివిజన్ కార్పోరేటర్ గడ్డం మహాలక్ష్మీరామన్‌గౌడ్ చెప్పారు. ప్రజలకు చేసే భాగ్యం అందరికి లభించదని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులైన, ప్రజా ప్రతినిధులైన సేవా అనే మార్గంలో పయనించాలన్నారు. శనివారం ఆమె డివిజన్‌లోని రెడ్డి కాలనీలో జిహెచ్‌ఎంసి, జలమండలి అధికారులతో పర్యటించి మాట్లాడారు. కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను వెంటనే పరిష్కారించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ పర్యటనలో ఆమెతో పాటు జిహెచ్‌ఎంసి అధికారులు దుర్గాప్రసాద్, దివ్య, శివ, వాటర్ వర్క్స్ అధికారులు మహేందర్‌రెడ్డి, రెడ్డి కాలనీ నాయకులు నారాయణరెడ్డి, అరుణ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరమణరెడ్డి, కిషోర్, జయలక్ష్మి, అనిల్‌గౌడ్, దేవి, బిజెపి నాయకులు రామన్‌గౌడ్, నర్సింగ్‌గౌడ్, మహేష్, జాకీ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సాయి మాధవ్‌కు పింగళి విశిష్ట సినిమా రచనా పురస్కారం

సైఫాబాద్, డిసెంబరు 31 ప్రభాతవార్త: అలనాటి సినీ రచయిత పింగళి నాగేంద్రరావు జయంతి సందర్భంగా ప్రముఖ సినీ రచయిత డా.బుర్రా సాయి మాధవ్‌కు 'పింగళి విశిష్ట సినిమా రచనా' పురస్కార ప్రదానోత్సవం రవీంద్రభారతిలో ఘనంగా జరిగింది. యువకళా వాహిని సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధులుగా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రామలింగేశ్వరరావు పాల్గొని సాయి మాధవ్‌కు పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సభకు అక్కినేని నాగేశ్వరరావు కళాపరిషత్ అధ్యక్షుడు సారిపల్లి కొండలరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సినీ రచయిత లక్ష్మి భూపాల, ప్రముఖ సాహితీ వేత్త ఓలేటి పార్వతీశం, పరిషత్ కార్యదర్శి చెన్నయ్య, కేంద్ర సంగీత అకాడమి సభ్యురాలు ఎస్పీ భారతి, ఎస్వీ రామారావు, సంస్థ అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా విద్యా శాఖాధికారి రమేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

## ప్రధానోపాధ్యాయులకు ఇచ్చిన నోటీసులను ఉపసంహరించుకోవాలి

**మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్31 ప్రభాతవార్త:**

మన ఊరు-మన బడి పనుల పురోగతిలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి ప్రధానోపాధ్యాయులకు ఇచ్చిన నోటీసులను ఉపసంహరించాలని కోరుతూ శనివారం జిల్లా విద్యా శాఖాధికారి రమేష్ కుమార్‌కు ఎస్టీయూ మెదక్ జిల్లా శాఖ పక్షాన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు ఎం.ప్రణీద్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఎ. రాజగోపాల్‌గౌడ్‌లు మాట్లాడుతూ మన ఊరు-మన బడి పనులు పూర్తి చేయుటలో ఎస్ఎంసీ తీర్మాణించిన కాంట్రాక్టర్ జాప్యం చేస్తే సబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు షోకాజు నోటీసులు జారీ చేయడాన్ని ఎస్టీయూ టీఎస్ మెదక్ జిల్లా శాఖ పక్షాన ఖండిస్తున్నామన్నారు. కాంట్రాక్టరు నిర్లక్ష్యానికి ప్రధానోపాధ్యాయులను బాధ్యులుగా చేయడం అసమంజసమని, విద్యాశాఖలో ఉపాధ్యాయుల ప్రమేయంలేని అంశాలపై కూడా ఉపాధ్యాయులే బాధ్యత వహించాలనటం సరికాదన్నారు. మన ఊరు-మన బడి పనుల పురోగతిలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి ప్రధానోపాధ్యాయులకు ఇచ్చిన నోటీసులను ఉపసంహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మండల కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్టు



పోలీస్ స్టేషన్‌లో మండల యువజన కాంగ్రెస్ నాయకులు

**కొల్చారం, డిసెంబర్31 ప్రభాతవార్త:**

ఛలో ప్రగతి భవన్.. పోలీస్ నియామకాల అవకతవకలపై రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివసేనారెడ్డి పిలుపు మేరకు ఛలో ప్రగతి భవన్ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరి వెళ్లకుండా మండల యువజన కాంగ్రెస్ నాయకులను శనివారం తెల్లవారు జామున కొల్చారం పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దర్జి రాజు, మాజీ అధ్యక్షులు పుల్లబోయిన దుర్గేష్ ముదిరాజ్, నాయకులు పట్లోరి అనిల్ కుమార్, వెంకట్‌గౌడ్, ఉపేందర్, వంజరి రాజు, జలగం ప్రభాకర్, పుల్లబోయిన రమేష్, సమీర్, ఆయూబ్, ఖలీల్, కరీం, ఫిరోజ్, వెంకట్, శ్రీను, సురేష్, దుర్గాప్రసాద్, రవి, ప్రభాకర్, మహీందర్, అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నఘనపూర్‌లో విలేజ్ లెవెల్ ప్రోగ్రాం



స్వయం సహాయ బృందాల మహిళలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**కొల్చారం, డిసెంబర్31 ప్రభాతవార్త:**

మండల పరిధిలోని చిన్నఘనపూర్ గ్రామంలో శనివారం విలేజ్ లెవెల్ ప్రోగ్రాంలో భాగంగా డీసీసీబీ మంబోజిపల్లి బ్రాంచ్ మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్‌లు పాల్గొని స్వయం సహాయక బృందాల మహిళలకు రూ.1 లక్ష నుండి 20 లక్షల వరకు రుణాలు, బంగారంపై తులానికి రూ. 36,000 ఎడ్యుకేషన్ రుణాలు, పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, లాంగ్ టర్మ్ లోన్స్‌లో (వడ్డీ రేటు 10.5%) భాగంగా డైరీ, ఫౌల్ట్రీ, గొర్రెలు, మేకలు, ట్రాక్టర్, హార్వేస్టర్, బైక్, వ్యవసాయ రుణాలు, హోమ్ లోన్స్ రూరల్ 15 లక్షలు, మండలం 25 లక్షలు, అర్బన్ 40 లక్షలు, సహకార సమృద్ధి డిపాజిట్ పథకం ద్వారా 7.75% ఎక్కువ వడ్డీరేటు చెల్లించబడుతుందని తెలిపారు. ఈ అవకాశం ఈ నెల 15వ తేదీ వరకు ఉటుందన్నారు. నూతనంగా యూపీఐ సేవలు కూడా అందుబాటులోకి రావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి ఇందిరా ప్రియదర్శిని, ఉప సర్పంచి నారాయణగౌడ్, డీసీసీబీ మేనేజర్ సౌభాగ్య, ఫీల్డ్ ఆఫీసర్ యాదగిరి, సీసీ సబిత, సీఏలు, స్వయం సహాయక బృందాల మహిళలు పాల్గొన్నారు.

## ఎఎన్ఎం పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**బెజ్జంకి, డిసెంబర్ 31, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని అదర్శ పాఠశాలలోని బాలికల హాస్టల్‌లో ఎఎన్ఎం పోస్టు ఖాళీగా ఉండడంతో దరఖాస్తులు అహ్వానిస్తున్నట్లు ఎంఈఓ పావని తెలిపారు. అర్హులు, ఉత్సాహవంతులైన మహిళా అభ్యర్థులు ఈనెల 1 నుంచి 7 వరకు సంబంధిత పత్రాలతో ఆదర్శ పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## అసలైన రైతులకు న్యాయం చేయాలి



రైతులతో కలిసి మాట్లాడుతున్న బిజెపి నాయకులు

**బెజ్జంకి, డిసెంబర్ 31, ప్రభాతవార్త :**

రైతులకు న్యాయం చేయాలని బిజెపి మానకొండూరు నియోజకవర్గ ఇంచార్జి గడ్డం నాగరాజు అన్నారు. శనివారం మండల పరిధిలోని దాచారం గ్రామంలో గల 124 సర్వే నెంబరులో ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటున్న భూమిని అయన పార్టీ నాయకులతో కలిసి సందర్శించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. దాచారం గ్రామంలో ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటున్న భూమిలో అవకతవకలు జరుగుతున్నాయని..నకిలీ రైతులను సృష్టించి అసలు రైతులకు అన్యాయం చేస్తున్నారని అధికారులు దళారులతో కుమ్మక్కై రైతులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. రైతులకు న్యాయం జరిగే వరకు బిజెపి అధ్వర్యంలో రైతుల పక్షన నిలబడి ధర్నాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సాన వేణు, మహేందర్, సంగ రవి, కచ్చు సంపత్, బాండ్ల జ్యోతి, పుర్మ నారాయణరెడ్డి, శ్రీధర్‌రావు, నూనె అంజనేయులు, వడ్లూరి శ్రీనివాస్, అట్లా లక్ష్మణ్, బండిపల్లి సత్యనారాయణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎంపీపీ

**మునిపల్లి, డిసెంబర్ 31, ప్రభాతవార్త:** నూతన సంవత్సరం సందర్భంగా పిఆర్‌టియూ ఉపాధ్యాయ సంఘం మునిపల్లి మండల శాఖ నాయులు మండల ఎంపీపీ గౌడిగామ శైలజశి వశంకర్, మునిపల్లి జెడ్పీటీసీ పైతన మీనాక్షిసాయికుమార్‌లతో కలిసి నూతన సంవత్సరల శుభాకాంక్షలు తెలిపి వారిచే పిఆర్‌టియు సంఘం 2023 నూతన సంవత్సరాల క్యాలెండర్‌ను ఆవిష్కరిచండం జరిగింది.



ఆయుష్మాన్ భారత్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## ఆయుష్మాన్ భారత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**-వైద్యాధికారి శిరీష**

**జగదేవ్‌పూర్, డిసెంబర్ 31 (ప్రభాతవార్త) :**

ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జగదేవ్‌పూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి శిరీష అన్నారు. శనివారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్ పథకంపై ఇంటింటికి తిరుగుతూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యకేంద్రాల్లో పనిచేస్తున్న ఆశ వర్కర్లు అర్హులైన వారిని గుర్తించి అంతర్జాలంలో వారి వివరాలను నమోదుచేసి ఈకేవైసీని చేయించాలని సూచించారు. అదేవిధంగా దేశ వ్యాప్తంగా ఆయుష్మాన్ భారత్ పథకం అమలు అవుతుందని, ఈ పథకాన్ని మండల ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఆరోగ్యశ్రీ టిఎల్ ఆరోగ్యమిత్ర ఏ.ఆంజనేయులు, జగదేవ్‌పూర్ పిహెచ్‌సి హెల్త్ అసిస్టెంట్ జితేందర్‌రెడ్డి, ఏఎన్ఎం రజినికుమారి, డీఈఓ కర్ణాకర్, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## పిఆర్‌టియు నూతన సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ



ఎర్రవల్లిలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, పిఆర్‌టియు నాయకులుల

**మర్కుక్, డిసెంబర్ 31 (ప్రభాతవార్త):**

పిఆర్‌టియుటిఎస్ మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి కుమార్‌ల ఆధ్వర్యంలో శనివారం ఎర్రవల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో మండల విద్యాధికారి ఉదయభాస్కర్‌రెడ్డి చేతులమీదుగా 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నారెడ్డి రామకృష్ణారెడ్డి, తుమ్మ కుమార్‌లు మాట్లాడుతూ నూతన సం వత్సరం జనవరిలో ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల షెడ్యూల్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం మండల పిఆర్‌టియు పక్షాన ప్రతి ఒక్కరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నీరడి లక్ష్మీనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షాబొద్దీన్, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌చారి, ఉపాధ్యాయులు బిక్షపతి, అన్నపూర్ణ పాల్గొన్నారు.

### జగదేవ్‌పూర్‌లో..



జగదేవ్‌పూర్‌లో పిఆర్‌టియు క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**జగదేవ్‌పూర్, డిసెంబర్ 31 (ప్రభాతవార్త):**

జగదేవ్‌పూర్ మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో శనివారం పిఆర్‌టియు సంఘం అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి శేఖర్‌ల ఆధ్వర్యంలో 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిద్దిపేట జిల్లా పిఆర్‌టియు సంఘం అధ్యక్షుడు ఆదరాసుపల్లి శశిధర్‌శర్మ, మండల విద్యాధికారి ఉదయభాస్కర్‌రెడ్డిలు హాజరై వారి చేతులమీదుగా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా నెలకొన్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పిఆర్‌టియు సంఘం నిరంతరం కృషి చేస్తూ సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకు సాగుతుందన్నారు. ఇటీవల ఉపాధ్యాయులకు ఉన్న సమస్యల పరిష్కారానికి శాసనమండలి సభ్యులు కూర రఘోత్తంరెడ్డి, రాష్ట్ర పిఆర్‌టియు అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరవెల్లి కమలాకర్‌రావులు ముఖ్యమంత్రిని కలువడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా 2003 డిఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేస్తూ సిపిఎస్‌ను పూర్తిగా రద్దు చేయాలని వివరించినట్లు తెలిపారు. మండల విద్యాధికారి ఉదయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ పిఆర్‌టియు సంఘం ప్రతి సంవత్సరం ప్రత్యేక నూతన క్యాలెండర్‌ను రూపొందిస్తుందని, రాష్ట్రంలోని ఉపాధ్యాయుల కోసం కృషి చేసే ఏకైక సంఘం పిఆర్‌టియు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, మహిళా ఉపాధ్యక్షురాలు రాధిక, మండల కార్యదర్శి మోతిరాం, ఉపాధ్యాయులు బొద్దు నాగేష్, బాలనర్సింహ్మారెడ్డి, నరేందర్‌రెడ్డి, సావిత్రి, సంతోష్‌కుమారి, కనకదుర్గ, శోభ, సునీత, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

**-యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్**



జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో యువజన కాంగ్రెస్ నాయకులు

**జగదేవ్‌పూర్, డిసెంబర్ 31 (ప్రభాతవార్త):**

అక్రమ అరెస్టులతో తెలంగాణ ప్రజల ఉద్యమాలను ఆపలేరని జగదేవ్‌పూర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పోలీసుల నియామకాల్లో జరుగుతున్న అవకతవకలకు నిరసనగా శనివారం యువజన కాంగ్రెస్ ఛలో ప్రగతిభవన్‌కు పిలుపునివ్వగా జగదేవ్‌పూర్ పోలీసులు స్థానిక యువజన కాంగ్రెస్ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో పోలీసుల నియామకాల్లో జరుగుతున్న అవకతవకలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ, యువజన కాంగ్రెస్ వ్యతిరేకిస్తూ ఛలో ప్రగతిభవన్ కార్యక్రమం చేపట్టగా ముందస్తుగా కుట్రపూరితంగా తమను అరెస్ట్ చేయడం సిగ్గుచేటని అన్నారు. ఉద్యమాలతో సాధించుకున్న తెలంగాణలో అక్రమ అరెస్టులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో బిఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు అజీజ్, వెంకట్, కృష్ణ, రూపేష్, బలరాం ఉన్నారు.



ముందస్తుగా పోలీసులు అరెస్టుచేసిన కాంగ్రెస్ నాయకుల దృశ్యం

## కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్టు

**రామాయంపేట, డిసెంబర్ 31, ప్రభాతవార్త:** రామాయంపేట పోలీసులు స్థానిక కాంగ్రెస్ నాయకులను శనివారం ముందస్తుగా అరెస్టు చేశారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్‌లో నియామకాలలో సవరింపులు చేయాలని, అభ్యర్థులకు ఎలింటి అన్యాయం జరగకుండా చూడాలని, నియామకాలలో అవకతవకలు జరగకుండా చూడాలని, డిసెంబర్ 31 న వైన్ షాపులు అర్థరాత్రి వరకు తెరవడం సరికాదని దానికి నిరసనగా రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శివసేనరెడ్డి పిలుపు మేరకు ప్రగతి భవన్ ముట్టడి కార్యక్రమానికి వెళతారలని స్థానిక 13 మంది కాంగ్రెస్ నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. రామాయంపేట పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నవారిలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతల యాదగిరి, ఉపాధ్యక్షుడు దండు శివశంకర్, ప్రధాన కార్యదర్శి అల్లాడి వెంకటేష్, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రొయ్యల పోచయ్య, జిల్లా కార్యదర్శి బైరం కుమార్, కౌన్సిలర్ బొర్ర అనిల్‌కుమార్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మధుగౌడ్, పట్టణ అధ్యక్షుడు భానుచందర్, నాయకులు గొల్ల రమేష్, మర్కు సతీష్ సాగర్, భాస్కర్, మహమ్మద్ అష్రాఫ్, మహ్మద్ సల్మాన్ తదితర కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

### నిజాంపేటలో..

**నిజాంపేట, డిసెంబర్ 31, ప్రభాతవార్త:** తెలంగాణ పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగ నోటిఫికేషన్‌లో అవకతవకలు జరిగాయని రేవంత్‌రెడ్డి పిలుపుమేరకు యువజన కాంగ్రెస్ ఆద్వర్యంలో ప్రగతి భవన్ ముట్టడికి పిలుపునివ్వడంతో శనివారం రోజున చలో ప్రగతి భవన్ ముట్టడి కార్యక్రమానికి వెళుతున్న కాంగ్రెస్ నాయకులను నిజాంపేట పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో అవకతవకలు జరిగాయని, తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగులకు అండగా ఉంటామని కల్లిబొల్లి మాటలు చెప్పి కాలయాపన చేస్తున్నారే గాని భర్తీ చేయడం లేదని ముందస్తు అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమావత్ వినోద్, ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు నసీరొద్దిన్, జిల్లా కార్యదర్శి పంజా మహేందర్, మధుసూదన్‌రెడ్డి, సిద్దరాములు, కాకి రాజయ్య, మహేష్, రాజు, షాబు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాంస్కృతిక సారధి ఆధ్వర్యంలో అవగాహన

**రామాయంపేట, డిసెంబర్ 31, ప్రభాతవార్త:**

తెలంగాణ సాంస్కృతిక సారథి ఆద్వర్యంలో రామాయంపేట మండల పరిధిలో అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం మండల పరిధిలోని ఆర్. వెంకటాపూర్ గ్రామంలో కళాకారులు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. తడిచెత్త, పొడిచెత్త తప్పనిసరిగా వేరుచేసి చెత్త బండికి ఇవ్వాలన్నారు. అలాగే ప్రతి ఒక్కరు చెట్లను పెంచాలని, ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణానికి సహకరించాలని ప్రజలకు సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని, మొక్కలు పెంచడం ద్వారా ఆరోగ్యకరమైన జీవితం ఏర్పడుతుందని కళాకారులు గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు.

## రైతులందరూ ఈకేవైసీ చేయించుకోవాలి

**మండల వ్యవసాయాధికారి సతీష్**

**నిజాంపేట, డిసెంబర్ 31, ప్రభాతవార్త:** రైతులందరూ ఈకేవైసీ చేయించుకోవాలని నిజాంపేట మండల వ్యవసాయాధికారి సతీష్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో శనివారం రోజున ఈకేవైసీ చేయించుకోని రైతుల ఇంటింటికి వెళ్లి ఈకేవైసీ చేయించారు. ప్రధానమంత్రి కిసాన్ డబ్బులు పడడానికి ఈకేవైసీ దోహదం చేస్తుందన్నారు.వ్యవసాయ విస్తరణ అధికారిని కావేరి, రైతులు పాల్గొన్నారు.

## హిందూ మనోభావాలను కించపరిచిన వ్యక్తిని అరెస్టు చేయాలి

**నిజాంపేట, డిసెంబర్ 31, ప్రభాతవార్త:** హిందూ మనోభావాలు కించపరిచే విధంగా శ్రీ అయ్యప్పస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్‌పై వెంటనే కేసు నమోదు చేసి కఠినమైన చర్యలు తీసుకోవాలని నిజాంపేట అయ్యప్ప సేవాసమితి, మరియు హిందూ సంఘాల ఆద్వర్యంలో ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డికి శనివారం నాడు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ కొడంగల్‌లో జరిగిన నాస్తికుల సభలో అయ్యప్ప స్వామిని, హిందూ దేవుళ్లను కించపరిచేలా మాట్లాడిన బైరి నరేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. హిందూ మనోభావాలకు కించపరిచే విధంగా మాట్లాడిన బైరి నరేష్ బేషరతుగా హిందువులకు క్షమాపణ చెప్పాలన్నారు. ఇలాంటికి మరోకసారి పునరావృతం కాకుండా చూసుకోవాలని హిందూ దేవుళ్లను కించపరిస్తే భౌతిక దాడులు చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవాసమితి సభ్యులు పెద్దపైడి నవీన్‌రెడ్డి, నాయిని వెంకటేశం, రంజిత్‌గౌడ్, వీరమల్లు బాలయ్య, నరేందర్, ప్రముఖ సంఘ సేవకులు పంజా మహేందర్, యాదగౌడ్, నాగరాజు, మాసుల సిద్దరాములు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

**వెల్దుర్తి, డిసెంబర్31 ప్రభాతవార్త:**

ఉమ్మడి మండల వ్యాప్తంగా శనివారం కొత్త సంవత్సర వేడుకలను వివిధ పాఠశాలలతో పాటు మండల కేంద్రమైన వెల్దుర్తిలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్బంగా కేక్ కట్ చేసి ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్ర మంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మన ఊరు-మన బడి పనులను పరిశీలించిన డీఈవో

**వెల్దుర్తి, డిసెంబర్31 ప్రభాతవార్త:** మండల పరిధిలోని శెట్టిపల్లి కలాన్ గ్రామంలోని పాఠశాలలో మన ఊరు-బడి కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న పనులను శనివారం జిల్లా విద్యా శాఖాధికారి రమేష్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ పట్టణ అధ్యక్షులుగా విక్రమ్ సింగ్

**వెల్దుర్తి, డిసెంబర్31 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణ బీజేపీ అధ్యక్షులుగా విక్రమసింగ్‌ను ఎన్నుకున్నట్లు మండల బీజేపీ అధ్యక్షులు చంది నర్సింలు తెలిపారు. శనివారం వెల్దుర్తి పట్టణ బీజేపీ నూతన కమిటీని ఎన్ను కున్నారు. ఈ సందర్బంగా వెల్దుర్తి పట్టణ అధ్యక్షులుగా విక్రమ్ సింగ్, ఉపాధ్యక్షులుగా పిచ్చిగారి శ్రీనివాస్‌లను ఎన్నుకోవడం జరిగిందన్నారు. నూతనంగా ఎన్నికైన వారు మాట్లాడుతూ వెల్దుర్తిలో బీజేపీ పార్టీ బలోపేతానికి తమ వంతుగా కృషి చేస్తామన్నారు. తమపై నమ్మకంతో ఎన్నుకున్నందున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## దరఖాస్తుల ఆహ్వానం

**చిన్నశంకరంపేట, డిసెంబర్ 31, ప్రభాతవార్త:** ప్రభుత్వం అందించే మైనార్టీ కార్పోరేషన్ లోన్ పొందడానికి అర్హులైన లబ్ధిదారులు జనవరి 5,2023 తెది లోగా ఆన్‌లైన్ లో దరఖాస్తులు సమర్పించాలని ఎంపీడీవో గణేష్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## నేటి నుంచి అంతర్‌రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్

**-విజేత జట్టుకు 5లక్షలు.. పక్షం రోజులు క్రీడాకారులతో సందడి**

**జహీరాబాద్, డిసెంబరు 31, ప్రభాతవార్త:** ఈ నెల 1వ తారీఖు నుంచి 15వ తేదీ వరకు పట్టణంలోని బాగారెడ్డి స్టేడియంలో కిజర్‌యా గోల్డ్ కప్ అంతర్‌రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కిజెర్‌యాపై మక్సుద్ అలీ, ఎండి అస్మత్ అలీ, యండి మీనాజులు తెలిపారు. ఆధివారం మధ్యాహ్నం 1 గంటకు టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. టోర్నిలో 26 జట్లు పాల్గొంటున్నట్లు వివరించారు. టోర్ని విజేత జట్టుకు 5లక్షల రూపాయలతో పాటు కప్పు, రన్నర్‌గా నిలిచిన జట్టుకు 3లక్షల రూపాయలతో పాటుకప్పును అందచేయడం జరుగుతుం దన్నారు.



హుస్నాబాద్ పట్టణంలోని కళాశాలలో ముందస్తు నూతన సంవత్సర వేడుకల దృశ్యం

## చెడును వదిలేసి మంచిని మదిలో నింపుకోండి

**కళాశాలలో ముందుస్తు 'నూతన' వేడుకలు**

**హుస్నాబాద్, డిసెంబరు31, ప్రభాతవార్త :**

దురలవాట్లు కొనసాగించకుండా మంచిని బుర్రలో ఉంచుకుని సుఖమయ జీవనాన్ని సాగించాలని దీంతో పాటు అనుకున్న లక్ష్యాలను చేరేందుకు శ్రద్దతో సాధన చేసి అధిగమించాలని అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని చిన్నారి విద్యార్థులకు హుస్నాబాద్ పట్టణంలోని శ్రీ అపోలో ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ వేముల గణేష్,డైరెక్టర్ వేముల అంజయ్య సూచించారు.ఈ నేపథ్యంలో శనివారం హుస్నాబాద్ శ్రీ అపోలో ఒకేషనల్ కళాశాలలో ముందస్తు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించి విద్యార్థులకు ఉపదేశం చేశారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి విద్యార్థుల్లో నూతనోత్సాహం నింపారు.నూతన వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు రెట్టించిన ఉత్సాహంతో ఆగుతూ పాడుతూ గంతులు వేస్తూ ఈ సంవత్సరానికి నృత్యాలతో గేయాలపనతో బైబై చెపుతూ నూతన వత్సరానికి స్వాగతం పలికుతూ సంబరాలు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకబృందం అల్లి మమత, లింగాల ప్రవీణ్,కనబోయిన అనిత, కాశబోయిన సుజాతరాణి, వొడిచెర్ల రాజేంద్రపసాద్, అధ్యాపకేతర బృందం పెట్టుగడి అరుణ, గుగులోతు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కుబడిగా నెలవారీ పంచాయతీ సమావేశం



కార్యదర్శి గైర్హాజరుతో మొక్కుబడి సమావేశం దృశ్యం

**అక్కన్నపేట, డిసెంబరు31, ప్రభాతవార్త**

పల్లెలు ప్రగతికి మెట్లు అని గ్రామ స్వరాజ్యం కోసం అకుంఠిత దీక్షతో ముందడుగు వేయాలని కలలు కన్న బాపూజీ కలలు నిర్వీర్యమవుతున్నాయి.ఇందుకు నిదర్శనంగా చౌటపల్లి పంచాయితీ తీరును చూస్తే అవగతమవుతుంది.గ్రామాభివృద్ధికి తాము నమ్మి ఎన్నుకున్న ప్రజాప్రతినిధుల తీరు ఇందుకు భిన్నంగా ఉందని ఏనాడు ఈ ప్రజా ప్రతినిధులు గ్రామాభివృద్ధికి పాటుపడుతున్న తీరును చూసి ముక్కున వేలేసుకుంటున్నారు.గతంలో చౌటపల్లి గ్రామ కార్యదర్శిగా పోగుల రాజు విధులు నిర్వహించేవారు.గ్రామాభివృద్ధిలో సదరు కార్యదర్శి రాజు అసలు స్పందించడం లేదనే ఆరోపణలతో అతడిని అక్కన్నపేట ఎంపిడివో బదిలీ చేసి అతని స్థానంలో కట్కూర్ గ్రామ కార్యదర్శి గుగులోతు మోహన్‌కు అదనపు బాధ్యతలను అప్పగించారు. ఇతను సైతం నెలవారీ పంచాయితీలో అభివృద్ధి సమావేశానికి హాజరు కాకుండా దుమ్మా కొడుతుండటంతో గ్రామ ప్రజల్లో తమ గోడును ఎవరికి చెప్పుకోవాలో తెలియని అయోమయపరిస్థితిలో కొట్టు మిట్టాడుతున్నారు. ఈ నేపథ్యంలో నెలవారీ అభివృద్ధి సమా వేశం శనివారం గ్రామసర్పంచ్ గద్దల రమేష్ అధ్యక్షతన నిర్వహిం చగా హాజరు కావలసిన కార్యదర్శి మోహన్ రాకపోవడంతో ఆదాయ వ్యయాల విషయంపై సర్పంచ్‌ను వార్డు సభ్యులు ఉపసర్పంచ్ కొత్తకొండ పోశెట్టి,గంగాధరి శ్రీనివాస్‌లు హాజరై ప్రశ్నించగా సర్పంచ్ సమాధానం చెప్పకుండా ఈ లెక్కలన్నీ కార్యదర్శికి తెలుసని దాట వేశారు. ఇదిలా ఉండగా వార్డుసభ్యులు ఎనిమిది ఉండాల్సి ఉండగా ఇందులో ఇరువురు వార్డుసభ్యులు చుంచు రజిత,పత్తిపాక లావణ్య లను ప్రభుత్వం అనర్హులుగా వేటువేసింది.ఇందులో నలుగురు వార్డు సభ్యుల సమావేశానికి రావాల్సి ఉన్నా వారు సైతం రాకపోవడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.మొక్కుబడిగా సమావేశాలు నిర్వహించి అభివృద్ధికి ఏం చేస్తారని చౌటపల్లి గ్రామ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన తహశీల్దార్, వ్యవసాయ అధికారి



వివరాలు నమోదు చేసుకుంటున్న ఏవో శ్వేత

**కొల్చారం, డిసెంబర్31 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొంగోడ్ గ్రామానికి చెందిన మేకల సుధాకర్ శుక్రవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. శనివారం తహశీల్దార్ చంద్రశేఖర్‌రావు, మండల వ్యవసాయ అధికారి శ్వేతలు మృతుడు సుధాకర్ ఇంటికి వెళ్లి భార్య అన్నపూర్ణ, కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని రైతు భీమాకు అవసరమైన సర్టిఫికెట్ల గురించి వారికి వివరించి గడువులోగా అందజేయాలని సూచించారు. రైతుభీమా డబ్బులు త్వరగా వచ్చేలా కృషి చేస్తామన్నారు. వీరి వెంట సర్పంచి కుకునూరి మంజుల సత్యనారాయణగౌడ్, ఆర్ఐ శ్రీహరి, ఏఈవో రమ్య, పంచాయితీ కార్యదర్శి సౌజన్య, ఫీల్డ్ అసిస్టెంట్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కొలువుల పేరుతో యువతపై సర్కార్ నాటకం

**హుస్నాబాద్, డిసెంబరు31, ప్రభాతవార్త**

యువతకు ఉద్యోగవకాశాలు కల్పిస్తున్నామంటూ తెలంగాణ ప్రభుత్వం మరోక వైపు కేంద్రంలో బిజెపి ప్రభుత్వాలు నటకమాడుత యువతను మోసం చేస్తున్నా యని హుస్నాబాద్ పట్టణ సోషల్‌మీడియా కో కన్వీనర్ కూన విశ్వతేజ తీవ్రంగా మండిపడ్డారు.నాడు కేంద్ర ప్రభుత్వం అగ్నిపథ్ పేరుతో సైనికులను రక్షణకోసం తీసుకునేందుకు అక్కరకు రాని నిబంధనలు విధించి డ్రామా ఆడితే ఇపుడు తెలంగాణ ప్రభుత్వం పోలీస్‌ల ఉద్యోగాల కొలువుల విషయంలో ఇలాంటి అక్కరకు రాని నిబంధనలతో యువతకు ద్రోహం చేస్తున్నా యని విశ్వతేజ అన్నారు.ఇవన్నీ తెలిసిన ప్రభుత్వం అదే మద్యం విషయంలో యువత తప్పతాగి మద్యం మత్తు లో ఊగుతూ తూగుతూ పడిపోవాలని చూస్తు నూతన సంవత్సర వేడుకలకు సంబందించి సమయాన్ని పొడిగించి నిబంధనలు సడలించారని అదే పోలీస్‌ల నియామకాల్లో నిబంధనలు సడలించని ప్రభుత వ్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఛలోప్ర గతిభవన ముట్టడికి యువకాంగ్రెస్ పిలుపునిస్తే తమను బొక్కలో వేసి ప్రభుత్వం చోద్యం చూస్తోందని కూన విశ్వతేజ అసంతృప్తిని వ్యక్తం చేశారు.హుస్నాబాద్ పోలీస్‌లు అదుపులోకి తీసుకున్న వారిలో కూన విశ్వతేజతో పాటు నాయకులు పోచవేని శ్రీశైలం, మ్యాదరబోయిన శ్రీకాంత్,ముడికె ప్రశాంత్,మారుపాక గణేష్,చెన్నవేని విద్యాసాగర్ ఉన్నారు

### అక్కన్నపేట ఠాణలో కాంగ్రెస్ నాయకులు

**అక్కన్నపేట, డిసెంబరు31, ప్రభాతవార్త**

ఛలో ప్రగతిబవన్ ముట్టడి పిలుపుమేరకు అక్కన్నపేట నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని నిర్బంధించారు.అదుపులో ఉన్న వారిలో కాంగ్రెస్ అధ్యక్షులు జంగపల్లి అయిలయ్య,పాండ్రాల దామెదర్, దేవునూరి రాజు,నకీర్తి ముని రాజు, రాకేష్,నవీన్ ఉన్నారు.

## విద్యార్థులు భావిభారత నిర్దేశకులుగా ఎదగాలి

**పటాన్‌చెరు, డిసెంబర్ 31, ప్రభాతవార్త:** విద్యార్థులు సత్ప్రవర్తనతో రేపటి భావిభారత నిర్దేశకులుగా ఎదగాలని పటాన్‌చెరు సిఐ వేణుగోపాల్ రెడ్డి స్కూల్ నూతన క్యాలెండర్-2023ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. ప్రతి ఒక్క విద్యార్థినీ, విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే మంచిని మాత్రమేక తెలుసుకొని, చెడు విషయాల జోలికి వెళ్ళవద్దాన్నారు. అపరిచిత వ్యక్తులు చేసిన మెసేజ్‌లు ఫార్వర్డ్‌ల చేసి, ఓటీపీలు చెప్పమంటే ఎట్టి పరిస్థితుల్లో చెప్పవద్దన్నారు. అలా అపరిచిత వ్యక్తులకు ఓటీపీలు చెప్పి చాలామంది విద్యార్థులు, యువత పెద్ద మొత్తంలో డబ్బులు పోగొట్టుకొని మోసపోయిన సంఘటనలు ఎన్నో ఉన్నాయని అన్నారు. విద్యార్థులు కష్టంతో కాకుండ ఇష్టంగా చదవాలని తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రులు మొదటి స్నేహితులుగా ఉంటూ అన్ని విషయాలను పంచుకోవాని అన్నారు. చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని తెలపారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠశాలను శ్రద్ధగా విని, కష్టపడి చదివి ఉన్నతమైన స్థానాలకు చేరుకొని వారి తల్లిదండ్రులకు, గురువులకు, స్కూల్‌కు మంచి పేరు తీసుకురావాలని సిఐ వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపల్ నాగరాజు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయునీలు, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.


శ్రీజలాంజనేయస్వామి పూజల్లో పాల్గొన్న భక్తులు

## జల హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదానం

**నర్సాపూర్, డిసెంబర్ 31, ప్రభాతవార్త:** నర్సాపూర్ మెదక్ ప్రధాన రోడ్డులోని పెద్దచింతకుంట గ్రామ శివారులో వెలిసిన జలహనుమాన్ ఆలయంలో శనివారం పురస్కరించుకొని శ్రీజలాంజనేయస్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు భక్తులు భక్తి శ్రద్ధలతో నియమ నిష్టలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ పూజారి రాధాకృష్ణాశర్మ, శివ,రాజు పంతుళ్ళ అధ్వర్యంలో వేద మంత్రాల మధ్యన జలాంజనేయస్వామికి జలాబిషేకం,పంచామృతాబిషేకం, చందన లేపనం, వంటి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ వడ్ల సుధాకర్‌చారి హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. ఈమేరకు మధ్యాహ్నం దాతలు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని అన్నదానాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలోఆలయ పూజారి రాధాకృష్ణాశర్మ, శివ,రాజు పంతుళ్ళు, ఆలయ కమిటీ చైర్మన్ వడ్ల సుధాకర్‌చారి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్


నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌లో ముందస్తు అరెస్ట్ అయిన కాంగ్రెస్ నాయకులు

**నర్సాపూర్, డిసెంబర్ 31.ప్రభాతవార్త:** తెలంగాణా యూత్ కాంగ్రెస్ అధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్ళనీయకుండి శనివారం నర్సాపూర్ కాంగ్రెస్ నాయకులను నర్సాపూర్ పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ లో ఉంచారు. తెలంగాణా పోలీస్ రిక్రూట్‌మెంట్ నియామకాల్లో అవకతవకలు జరుగడం వల్ల అనేక మంది నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందని ఇందుకు నిరసనగా తెలంగాణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివసేనారెడ్డి అధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి నాయకులు రావాల్సిందిగా పిలుపునివ్వడం జరిగింది. ఈ మేరకు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లనీయకుండా పోలీసులు ముందస్తు అరెస్ట్ చేయడం జరిగింది. ఈ మేరకు అరెస్ట్ అయినవారిలోనర్సాపూర్ ఎంపిపి జ్యోతిసురేవ్‌నాయక్, నర్సాపూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు డి.ఆంజనేయులు గౌడ్, యువజన కాంగ్రెస్ నాయకులు భరత్‌రాజ్‌గౌడ్, ఎన్ఎస్‌యుఐ కన్వీనర్ మణిదీప్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీశైలెంయాదవ్, రశీద్, కొండి దుర్గేశ్, మాణిక్యంగౌడ్, రెడ్డిపల్లి ఉప సర్పంచ్ అశోక్‌గౌడ్, యువజనకాంగ్రెస్ నాయకులు ఆనంద్‌కుమార్, అజ్మత్‌బాయ్ తదితరులున్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత


బాధితుడు ప్రభాకర్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేస్తున్న దృశ్యం

**నర్సాపూర్, డిసెంబర్ 31, ప్రభాతవార్త:** నర్సాపూర్ మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన నోముల ప్రభాకర్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి క్రింద 60 వేల రూపాయిలు మంజూరు అయ్యాయి. ఇందుకు సంబందించిన చెక్కును శనివారం నర్సాపూర్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బోగ చంద్రశేఖర్ చేతుల మీదుగా బాధితుడు లింగాపూర్ గ్రామానికి చెందిన నోముల ప్రభాకర్ కు అందజేయడం జరిగింది.నర్సాపూర్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బోగ చంద్రశేఖర్ తో పాటు గ్రామ సర్పంచ్ ఉప్పలపు అశోక్, తుజాల్‌పూర్ గ్రామ మాజీ సర్పంచ్ కల్లూరి ఆంజనేయులు, లింగాపూర్ బిఆర్ఎస్ నాయకుడు లక్ష్మినర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## రూరల్ ఠాణాను సందర్శించిన డిఎస్‌పి

**సంగారెడ్డి టౌన్, డిసెంబరు 31, ప్రభాతవార్త:** సంగారెడ్డి రూరల్ పోలీసు ఠాణాను సంగారెడ్డి డివిజన్ డిఎస్‌పి బి రవీంద్రరెడ్డి శనివారం సందర్శించారు. ఠాణాకు చేరుకున్న డిఎస్‌పిని ఠాణాలోని రికార్డులను, కేసులకు సంబంధించిన సిడి ఫైల్స్‌లను పరిశీలించి కేసుల వివరాలపై ఆరా తీశారు. పోలీసు ఠాణా పరిసరాలు పరిశీలించారు. పోలీసు సిబ్బంది తో పలు విషయాలపై చర్చించారు. రోడ్డు ప్రమాదాలు, ఆస్తికి సంబంధం చిన నేరాలు, సైబర్ నేరాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని పోలీసులకు సూచించారు. డిఎస్‌పి వెంట సంగారెడ్డి రూరల్ సిఐ, రూరల్ ఎస్ఐ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## టియన్‌జిఓస్ సంఘం అధ్యక్షునిగా ఎండి.నవాజ్‌అలి


టియన్‌జిఓస్ నూతన కమిటీని సన్మానించిన దృశ్యం

**సదాశివపేట, డిసెంబర్ 31, ప్రభాతవార్త:** సదాశివపేట తాలుకా టియన్‌జిఓస్ సమావేశం నిర్వహించి నూతన సంఘంను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షునిగా ఎండి.నవాజ్‌అలి, కార్యదర్శిగా టి.సంపత్‌కుమార్, ఉపాధ్యక్షులుగా ఎండి.ముజాహిద్, ఆర్గనైజర్‌గా శైలజ, ఇసి సభ్యులుగా బి.సువర్ణ, చంద్రప్రకాష్‌లను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నుకున్న సంఘం సభ్యులను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టియన్‌జిఓస్ సభ్యులు పాల్గొన్నారు.

### జీస్క్వేర్ ఈడెన్ గార్డెన్‌కు అపూర్వ ఆదరణ

దక్షిణ భారతదేశంలో అతిపెద్ద ప్లాట్ ప్రమోటర్ జీస్క్వేర్ హౌసింగ్ ఇటీవల నగరంలోని బీఎన్‌రెడ్డినగర్‌లో మొదటి ప్రాజెక్టు జీస్క్వేర్ ఈడెన్ గార్డెన్‌ను ఆవిష్కరించింది. నగరంలో మొట్టమొదటి స్పోర్ట్స్ థీమ్డ్ ప్లాటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టుగా తీర్చిదిద్దిన ఈ ప్రాజెక్ట్‌లో 484 ప్రీమియం రెసిడెన్షియల్ ప్లాట్స్ ఉన్నాయి. వీటన్నింటికీ జీహెచ్ఎంసీ రెరాఅనుమతించాయి. జీస్క్వేర్ ఈడెన్ గార్డెన్ ప్లాటెడ్ ప్రాజెక్టును ఆవిష్కరించిన తొలినాలుగు రోజుల్లో 1000 మందికి పైగా కొనుగోలు దారుల సందర్శించడంతోపాటు290కుపైగా బుకింగ్స్ జరిగాయి.


పార్టీలో చేరిన యువకులకు కండువలు కప్పి ఆహ్వానిస్తున్న దృశ్యం

## సదాశివపేటలో బిజెపిలో భారీ చేరికలు

**సదాశివపేట, డిసెంబర్ 31, ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం మద్దికుంట తండా గ్రామస్తులు బిజెపి రాష్ట్ర నాయకులు శివరాజ్‌పాటిల్ సమక్షంలో శనివారం దాదాపు 79మంది యువకులు బిజెపి పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి పార్టీ కండువలు కప్పి ఘనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక ముందు కూడా బిజెపిలోకి సంగారెడ్డి నియోజకవర్గం నుండి భారీ చేరికలు ఉంటాయని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ కన్వీనర్ సంగమేశ్వర్, జిల్లా కార్యదర్శి సారా కృష్ణ, అసెంబ్లీ కన్వీనర్ సిహెచ్ సత్యనారాయణ, ఓబిసి మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్, మండల అధ్యక్షులు అంబదాస్, బిజెవైఎం మండల అధ్యక్షులు అంజియాదవ్, శివకుమార్, అభిలాష్, నాయకులు బ్రహ్మానందరెడ్డి, నగేష్, బబ్లు, వీరగౌతం, అశోక్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## బైరి నరేష్‌పై పిడి యాక్ట్ నమోదు చేయాలి


గౌరారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

**వర్గల్, డిసెంబర్ 31 (ప్రభాతవార్త):** హిందూ దేవుళ్ళపై, అయ్యప్పస్వామి జీవిత చరిత్రపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్‌పై పిడి అక్ట్ నమోదుచేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం వర్గల్ మండలం గౌరారం రాజీవ్‌రహదారిపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ దేవుళ్ళపై ఎవరైనా అనుచిత వ్యాఖ్యలు చేయాలంటే భయపడేవిధంగా బైరి నరేష్‌ను శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌరారం శ్రీ సీతారామాం జనేయ భజన మండలి బృందం, శ్రీ అయ్యప్ప దీక్షా సంఘం సభ్యులు, శ్రీ రేణుక ఎల్లమ్మ భజన మండలి బృందం, హిందువులు, హిందూ సంఘ నాయకులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పిఆర్‌టియు కృషి

-పిఆర్‌టియు మండల అధ్యక్షుడు వేమారెడ్డి


గజ్వేల్‌లో పిఆర్‌టియు క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

**గజ్వేల్, డిసెంబర్ 31 (ప్రభాతవార్త):** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పిఆర్‌టియు నిరంతరం కృషి చేస్తుందని గజ్వేల్ మండల అధ్యక్షుడు ఊడెం వేమారెడ్డి అన్నారు. శనివారం పిఆర్‌టియు మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేమారెడ్డి, తీగుళ్ళ లింగంగౌడ్‌ల ఆధ్వర్యంలో పిఆర్‌టియు సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కె.సునీత, మండల నోడల్ అధికారి వై.కృష్ణ, అహ్మదీపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఎండి.కరీముద్దీన్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పి.రామకృష్ణారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ.కనకరాములు, యు.శ్రీనివాస్, టి.బాలుచరణ్, రాష్ట్ర కార్యదర్శులు పి.శ్రీనివాసరావు, బి.పోచయ్యగౌడ్, ఏ.సత్యనారాయణరెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు సిహెచ్.నాగరాజు, జిల్లా కార్యదర్శి పి.వెంకటేషంగౌడ్, మండల అసోసియేట్ అధ్యక్షుడు భూపతిరెడ్డి, కార్యదర్శులు నాగరాజు, మాజీ అధ్యక్షుడు జానకిరామ్‌రెడ్డి, బషీరుద్దీన్, సీనియర్ నాయకులు జి.శ్రీనివాస్, ఎస్.శ్రీనివాస్, కాశీనాథం, సంతోష్‌రెడ్డి, నరసింహారెడ్డి, సంతోష్‌కుమార్, ప్రవీణ్‌చారిపాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులను వేంటనే విడుదల చేయాలి

**కొండపాక, డిసెంబర్ 31, ప్రభాతవార్త**

పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన బిల్లులను వేంటనే చెల్లించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డమైన అరవింద్, దాసరి ప్రశాంత్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం దుద్దెడ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలిష్ చేసిన బియ్యాన్ని కాకుండా నాణ్యమైన బియ్యం జిల్లా అంతట మధ్యాహ్న భోజనానికి సరఫరా చేయాలని కోరారు.జిల్లా ఉపా ధ్యక్షుడు కొండం సంజీవ్, అముదాల రంజిత్‌రెడ్డి, నాయకులు సంతోష్, నరేష్ పాల్గొన్నారు.


అయ్యప్పస్వామి పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

## అయ్యప్ప మహాపడిపూజలో ఎమ్మెల్యే పూజలు

**మనూర్, డిసెంబరు 31, ప్రభాతవార్త:** మండలంలోని దవ్వూర్ గ్రామ చౌరస్తాలోని లంక హనుమాన్ ఆలయ ఆవరణలో శనివారం అయ్యప్పస్వామి మహాపడి పూజా కార్యక్రమాన్ని అయ్యప్పస్వామి దీక్షాపరులు భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. అయ్యప్పస్వాములు మహాపడి మెట్టు మెట్టుకు అయ్యప్పస్వామి నామాన్ని స్మరిస్తూ చేసిన పూజలు భక్తులను భక్తిసాగరంలో ముంచెత్తాయి. అయ్యప్పస్వామి దీక్షాపరులు భజనలు చేస్తూ ఆలపించిన పాటలతో ఆలయ పరిసరాలను భక్తిసాగరంలో మునిగిపోయింది. పూజా కార్యక్రమాలకు నారాయణఖేడ్ శాసన సభ్యులు మహారెడ్డి భూపాల్‌రెడ్డి హాజరై అయ్యప్ప స్వామి దీక్షాపరులు మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి ఆశీర్వచనాలు అందచేశారు. ఎమ్మెల్యేతో పాటు జడ్పీటిసి సభ్యులు నర్సింహారెడ్డి, కౌన్సిలర్ స్వప్న అభిషేక్ షెట్కార్,మనూర్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు విఠల్‌రావు, అయ్యప్వామి దీక్షాపరులు నర్సింహాగుప్తా స్వామి, శ్రీనివాస్‌రెడ్డి స్వామి, ఓం ప్రకాశ్‌స్వామి, జ్ఞానేశ్వర్‌రెడ్డి స్వామి, గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోలీసులను సన్మానించిన బ్రాహ్మణ సేవా సమాజ్


సిఐ, ఎస్ఐలను సన్మానిస్తున్న దృశ్యం

**న్యాల్‌కల్, డిసెంబరు 31, ప్రభాతవార్త:** బ్రాహ్మణ సేవా సమాజ్ సంస్థ మండల బాధ్యులు శనివారం హద్నూర్ పోలీసు ఠాణాలో పోలీసులను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఉదయం పోలీసు ఠాణాకు చేరుకున్న బ్రాహ్మణ సమాజ సేవా సంస్థ జిల్లా అధ్యక్షులు రాజ్‌కుమార్ దేశ్‌పాండే, జిల్లా కార్యవర్గ సభ్యులు జగదంబారావు కులకర్ణి, న్యాల్‌కల్ మండల ప్రధాన కార్యదర్శి మోహన్‌రావు జ్యోషి, కార్యవర్గ సభ్యులు బడశేషి శ్రీధర్‌రావు, శ్రీనివాస్‌రావు దేశ్‌ముఖ్, జహీరాబాద్ పట్టణ కార్యదర్శి పరమేశ్వరయ్య అయ్యర్, కులకర్ణి భగవాన్, శ్రవణ్కుల్ తదితరులు చేరుకుని జహీరాబాద్ రూరల్ సిఐ నోముల వెంకటేశ్, ఎస్ఐ వినయ్‌కుమార్‌లను ఘనంగా సత్కరించారు.

## స్వయం ఉపాధితో అభివృద్ధి సాధ్యం


కిరాణా దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ రాజేందర్‌రెడ్డి దృశ్యం

**ఝరాసంగం, డిసెంబరు 31, ప్రభాతవార్త:** స్వయం ఉపాధితో అభివృద్ధి చెందడం తథ్యమని ఎస్ఐ రాజేందర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని ఇస్లాంపూర్ క్రాస్ రోడ్డు సమీపంలో అద్విష్ రాణా కిరణ జనరల్ స్టోర్, టెంటన హౌజ్‌లను ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి జులాయిగా తిరిగాడకుండా ఏదో ఒక పని చేసుకుంటూ ఉంటే జీవితంలో అభివృద్ధి చెందడం తథ్యమన్నారు. ఉద్యోగాలు కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధి పనులను నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు రాంపూర్ ప్రకాశ్, అయుదాల సునీల్, మహేందర్, ధన్నారం సంజీవ్, మహేశ్, కల్వకుంట్ల అనిల్, శాం తదితరులు పాల్గొన్నారు.


ఆర్టీసీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి

## అన్ని రూట్లలో బస్సులు నడపాలి: ఎమ్మెల్యే

**నారాయణఖేడ్, డిసెంబర్ 31 ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని అన్ని రూట్లలో సమాయనికి బస్సులు నడపాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి ఆర్టీసీ అధికారులకు సూచించారు. శనివారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఖేడ్ ఆర్టీసీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని రూట్లలో సరైన సమాయానికి బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు.నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు రోడ్లు వేశామని ప్రజలకు ఇబ్బందులు లేకుండా బస్సులు సరైన సమయానికి నడపాలని సూచించారు. విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ఉదయం సాయంత్రం వారికి ఇబ్బందులు లేకుండా సరైన సమయానికి బస్సులు నడపాలని ఆర్టీసీ అదికారులకు సూచించారు.డీఎం మల్లేశయ్య, డిపో సీఐ ప్రవీన్, మార్కెటింగ్ ఇంఛార్జి పాండు ఉన్నారు.

### సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

**నారాయణఖేడ్, డిసెంబర్ 31 ప్రభాతవార్త:** పేదలను ఆదుకోవడమే తెరాస ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు.మాధ్వార్ గ్రామానికి చెందిన బాగయ్య కుమారుడు పండరి గత కొన్ని రోజులుగా ఆరోగ్యం బాగాలేనందున హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రభుత్వం ఆయనకు సీఎం సహాయ నిధి కింద రూ.40,000 వేలు ప్రభుత్వం మంజూరు చేసింది. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారునికి ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి చేతుల మీదుగా పండరికి సీఎం సహాయ నిది చెక్కు అందజేశారు. కల్హేర్ జడ్పీటీసీ నర్సింహ రెడ్డి, కౌన్సిలర్లు స్వప్న అభిషేక్ శెట్కార్, మనూరు మండల పార్టీ అధ్య క్షులు విఠల్‌రావు, స్వాములు నర్సింహగుప్త, శ్రీనివాస్‌రెడ్డి, ఓం ప్రకాష్, జ్ఞానేశ్వర్‌రెడ్డి తదతరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం


గజ్వేల్‌లో ఎస్ఎఫ్ఐ జెండా ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

**గజ్వేల్, డిసెంబర్ 31 (ప్రభాతవార్త):** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ 53వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం గజ్వేల్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ గజ్వేల్ డివిజన్ కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ మాజీ నాయకుడు రాజు ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో విద్యారంగ సమస్యల కోసం నిరంతరం పోరాటం చేసే ఎస్ఎఫ్ఐ శాస్త్రీయ విద్యా విధానం కోసం ఉద్యమిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ గజ్వేల్ డివిజన్ అధ్యక్షుడు నాచారం శేఖర్, నాయకులు జ్యోతిర్మయి, మహేష్, అబ్దుల్, నిరంజన్, వినయ్, అభిలాష్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## నెల రోజులు జిల్లాలో పోలీసు యాక్టు అమలు

**సంగారెడ్డి టౌన్, డిసెంబరు 31, ప్రభాతవార్త:** 2023 జనవరి 1వ తారీఖు నుంచి 31వ తేదీ వరకు జిల్లాలోని ఆయా గ్రామాల్లో 30, 30(ఎ) పోలీసు యాక్ట్-1861 అమలులు ఉంటుందని జిల్లా ఎస్పీ యం రమణకుమార్ సూచించారు. పోలీసు అధికారుల ముందస్తు అనుమతులు లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, బహిరంగ సమావేశాలు, సభలు, నిర్వహించరాదన్నారు. ప్రజలకు, ప్రజా ధనానికి నష్టం కల్గించే, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డ వారిపై చట్ట రీత్యా చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.


బైరీ నరేష్‌కు వ్యతిరేకంగా పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న స్వాములు


బైరీ నరేశ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న హిందూ సంఘాల నాయకుల దృశ్యం


దుద్దెడలో నరేష్‌ను అరెస్ట్ చేయాలని ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


బైరీ నరేశ్‌ను కఠినంగా శిక్షించాలని నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

# బైరీ నరేష్ అనుచిత వ్యాఖ్యలపై నిరసనల హోరు

## నరేశ్‌ను శిక్షించాలని డిమాండ్, దిష్టిబొమ్మల దహనం

**సదాశివపేట, డిసెంబర్ 31, ప్రభాతవార్త:** నిష్టతో నియమాలతో అయ్యప్ప మాల వేసుకున్న భక్తుల పట్ల అయ్యప్పస్వామి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల నిరసనగా శనివారం సదాశివపేట పట్టణ కేంద్రంలోని పురవీధుల్లో నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ వద్ద అయ్యప్ప స్వాములు రాస్తారోకో నిర్వహించారు. బైరి నరేష్ అనే వ్యక్తి అయ్యప్పస్వామి జననంపై హిందూ మంతంపై అను చిత వ్యాఖ్యలు చేయడానికి నిరసిస్తూ గంట పాటు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. అయ్యప్పస్వామి భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడిన బైరి నరేష్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి శరణు ఘోష చెబుతూ అయ్యప్పస్వామిని నిందించిన బైరి నరేష్ అనే వ్యక్తిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. అనంతరం ర్యాలీగా తరలి వెళ్ళి పట్టణ పోలిస్టేషన్‌లో బైరి నరేష్‌కు వ్యతిరేకంగా ఫిర్యాదు చేశారు. ఈ రాస్తారోకో కార్యక్రమంలో అయ్యప్పస్వాములు, గురుస్వాములు గోనే శంకర, నాయుడు, చెన్ బసయ్య, శివ, అనంతిరెడ్డి, ఓదెల ప్రభు, దిడిగే నాగేష్‌తో పాటు నాయకులు శివరా జ్‌పాటిల్, సత్యనారాయణ పాల్గొన్నారు.

### హద్నూర్‌లో నరేష్ దిష్టిబొమ్మ దహనం

**న్యాల్‌కల్, డిసెంబరు 31, ప్రభాతవార్త:** హిందువుల మనోభావాలు దెబ్బతినేలా అయ్యప్పస్వామి జననంపై అవహేళనగా కూసిన బైరి నరేష్‌ను కఠినంగా శిక్షించాలని భారతీయ జనతా పార్టీ, విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ నాయకులు శనివారం హద్నూర్ పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేశారు. భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు ఏక్‌నాథ్‌రావు పాటిల్ ఆధ్వర్యంలో ఆయా సంఘాల నాయకులు ఠాణాకు చేరుకుని ఎస్ఐ వినయ్‌కుమార్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా స్టేషన్ ముందు నుంచి బైరి నరేష్ దిష్టిబొమ్మను ఊరేగిస్తూ హద్నూర్ గ్రామంలోని హద్నూర్-మెటల్‌కుంట రోడ్డుపై దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.

### ఝరాసంగంలో..

**ఝరాసంగం, డిసెంబరు 31, ప్రభాతవార్త:** హిందువుల మనోభావాలు దెబ్బతినేలా ప్రసంగించిన బైరి నరేష్‌పై వెంటనే పిడి యాక్టు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ హిందూ సంఘాల నాయకులు తహసీల్దార్, ఎస్ఐలకు ఫిర్యాదు చేశారు. శనివారం మండల కేంద్రమైన ఝరాసంగంలోని రెవిన్యూ కార్యాలయానికి, పోలీసు ఠాణాకు హిందూ సంఘాల నాయకులు, భారతీయ జనతా పార్టీ నాయకులు బైరి నరేశ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నరేశ్‌పై వెంటనే పిడి యాక్టు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రాలు అందచేశారు. కార్యక్రమంలో ఆయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### జహీరాబాద్‌లో..

**జహీరాబాద్, డిసెంబరు 31, ప్రభాతవార్త:** అయ్యప్ప స్వామిని జననంపై సమాజం సిగ్గుపడేలా, హిందూ సమాజం తలదించుకునేలా ప్రసంగించిన బైరి నరేష్‌పై పిడియాక్టు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం జహీరాబాద్ పట్టణంలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ, రాస్తా రోకోను నిర్వహించారు. పట్టణంలోని భవాని మాత ఆలయం నుంచి జాతీయ రహదారి మీదుగా బస్టాండు వరకు హిందూ సంఘాలు, అయ్యప్ప దీక్షాపరులు నరేశ్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం వరకు చేరుకుని నరేశ్‌పై కఠిన చార్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రం అందచేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ మంకాల్ సుభాష్, హిందూ సంఘాల నాయకులు సాయిరెడ్డి విఠల్‌రెడ్డి, గొల్ల బాస్కర్, నీల రాజేశ్వర్, అల్లాడి కృష్ణ,నామ రవికిరణ్, బండారీ సుధీర్ కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, అయ్యప్ప దీక్షాపరులు పాల్గొన్నారు.

### కొండపాకలో..

**కొండపాక, డిసెంబర్ 31, ప్రభాతవార్త :** హిందువుల దేవతలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్‌ను వేంటనే అదుపులోకి తీసుకొని ఆరెస్ట్ చేసి శిక్షించాలని దుద్దెడలో అయ్యప్ప సేవా సమితి, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో బైకు ర్యాలీ నిర్వహించి అతని దిష్టి బోమ్మను రాజీవ్ రహదారిపై దహనం చేశారు. అతన్ని ఆరెస్ట్ చేయాలని త్రి టౌన్ ఎస్సై శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందు దేవుళ్లు, దేవాలయల బోలికి వస్తె సహించబోమన్నారు. కార్యక్రమంలో దుద్దెడ అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు గ్రామ సర్పంచ్ అరెపల్లి మహదేవ్, ఉపాధ్యక్షుడు గోనె రమేష్, ప్రధాన కార్యదర్శి చిలుముల వెంకటేశం, కోశాధికారి రామచంద్రారెడ్డి, సభ్యులు సురేందర్‌రావు, జగధీశ్వర్, కనకరాజు, భజరంగ్ దళ్ కార్యకర్తలు నరహరి, శ్రీకాంత్, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా కుకునూరుపల్లిలో అర్యవైశ్య సంఘం, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయ్యప్ప స్వాముల సేవ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### బైరీ నరేష్‌ను వెంటనే శిక్షించాలి

**అల్లాదుర్గం, డిసెంబర్ 31, ప్రభాతవార్త:** అయ్య ప్ప స్వామి, హిందూ దేవుళ్లపై అసభ్యకరమైన పదజాలా లతో అనుచిత వ్యాఖ్యాలు చేసిన బైరీ నరేష్, రెంజర్ల రాజేష్, బాన్సువాడ నర్సింలను వెంటనే అరెస్ట్ చేసి శిక్షించాలని శనివారం నాడు హిందూ వాహిని సంస్థ ఆధ్వర్యంలో ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డిని కలిసి అల్లాదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా హిందూ వాహిని సంస్థ కార్యకర్తలు మాట్లాడుతూ హిందూ సమా జంలో మాయని మచ్చతెచ్చే విధంగా అయ్యప్ప భక్తులపై, హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యాలు చేస్తూ సోషల్ మీడియాలలో పోస్ట్ చేసిన బైరీ నరేష్, రెంజర్ల రాజేష్, బాన్సువాడ నర్సింలపై వెంటనే కఠిన చర్యలు తీసుకొని హిందూ గౌరవాన్ని కాపాడాలని వారు కోరారు. ఇలాంటి సం ఘటలను ఎక్కడ కూడా పునరావృతం కాకుండ ఉండాలంటే వీరిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అల్లాదుర్గం ఎంపీటీసీ దశరథ్, హిందూ వాహిని సభ్యులు సదానందం, కొంక శ్రీశైలం, ఆకుల రమేష్, మోహన్ రాథోడ్, ఎం దుర్గేష్, కళాయి పాండు, సురేష్, శివ, పాపయ్య, రవి, రవి కిరణ్ పాల్గొన్నారు.